


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక


GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 151 | ఆదివారం 07- 06 -2026 | పేజీలు : 12 | No: KNL/3-77(D)/2026-2028 | వెల-3


## టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు వీరే...

అధికారికంగా ప్రకటించిన చంద్రబాబు



## రాజ్యసభకు లింగమనేని నామినేషన్

కూటమి ఎమ్మెల్యేలు మద్దతుగా హాజరు

స్వగ్రామంలో రమేశ్‌కు మద్దతుగా సంబరాలు

2లో



## సహారా ఎడారిలో మృత్యు ఘోష

నీళ్లు లేక 49మంది మృత్యువాత

2లో



# మద్యనిషేధ హామిని గాలికొదిలేసిన జగన్

సిపిఎస్ రద్దు చేస్తామని మోసం చేసిన వైసిపి

జాబ్ క్యాలెండర్ పేరుతోనూ మోసం చేశారు

టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో భేటీ చంద్రబాబు విమర్శలు

2లో

మద్యపానం నిషేధం చేస్తామని హామీ ఇచ్చి గొడ్డలి పార్టీ చేతులెత్తేసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. వైసీపీ హయాంలో సీపీఎస్ వారం రోజుల్లో రద్దు చేస్తామని చెప్పి ఎందుకు పక్కన పెట్టేసిందని ప్రశ్నించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై దిశినిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని గొడ్డలి పార్టీ మాట తప్పిందని ధ్వజమెత్తారు. ఇంతటితో ఆగకుండా వ్యవస్థలను విధ్వంసం చేసిందని మండిపడ్డారు.

వైసీపీ హయాంలో చెప్పినవి చేయకపోగా తమ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025పై బురద జల్లుతోందని ఆగ్రహించారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై ఎలా దుష్ప్రచారం చేసి లబ్ది పొందారో... డీఎస్సీ విషయంలోనూ దుష్ప్రచారంతో లబ్దిపొందాలనుకున్నారని దుయ్యబట్టారు.

## ఆరోగ్యకర జీవనానికి ఆర్గానిక్ వ్యవసాయం



### తాడేపల్లి ఆర్గానిక్ ఫామ్‌ను సందర్శించిన మంత్రి సవిత

2లో

ఆరోగ్యకర జీవనానికి ఆర్గానిక్ వ్యవసాయం అవసరమని మంత్రి సవిత అన్నారు. తాడేపల్లిలో ఆర్గానిక్ ఫామ్‌ను మంత్రి సవిత సందర్శించారు. శనివారం క్యాంప్ కార్యాలయం నుంచి సైకిల్‌పై ప్రాతూరు రోడ్డులోని ఆర్గానిక్ వెజిటబుల్ ఫామ్‌ను మంత్రి సందర్శించారు.

# గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

సంవృద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి

2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.. భారత దేశం అభివృద్ధి చెందాలంటే గ్రామాలు అభివృద్ధి చెందాలన్నారు. గ్రామాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చేలా సంవృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో సంవృద్ధి కేంద్రం ద్వారా పౌరసేవలు, డిజిటల్ సేవలను అందించనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఒక గ్రామం అభివృద్ధి చెందాలంటే వారికి అందిస్తున్న సేవలు ప్రజలకు చేరువులో ఉండాలని

2లో



## డ్రోన్ దాడులు జరిగినా వెనక్కి తగ్గలేదు..



రష్యాలో జరిగిన అంతర్జాతీయ ఆర్థిక సదస్సుకు హాజరైన మంత్రి నారా లోకేష్

సదస్సు ప్రారంభానికి ముందు సెయింట్ పీటర్స్‌బర్గ్‌పై ఉక్రెయిన్ డ్రోన్ల దాడులు

దాడులు జరిగినా ముందుగా నిర్ణయించిన పర్యటనను కొనసాగించిన లోకేష్

ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశం

పెట్టుబడిదారులకు ఇచ్చిన మాటకే కట్టుబడినట్లు వెల్లడి

2లో

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

ఇదే తమ మొదటి డిమాండ్..కొనసాగిస్తాం కూడా

ప్రవేశ పరీక్షల అవతవకలకు బాధ్య వహించాల్సిందే

2లో

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే డిమాండ్

జంతర్ మంతర్ వద్ద ధర్నా...ధర్నాలో పాల్గొన్న పర్యావరణవేత్త వాంగ్‌చుక్



# కోటిచెరువు భూమిని వెంటనే వెనక్కివ్వు

## పవన్ కల్యాణ్‌పై కవిత ఫైర్



కోటి చెరువు శిఖం భూమిని పవన్ కబ్జా చేశారన్న కవిత

తెలంగాణ ప్రభుత్వానికి భూమిని అప్పగించాలని డిమాండ్

తెలంగాణ కచ్చితంగా తమ జాగీరేనని వ్యాఖ్య

2లో

తెలంగాణ రాజకీయాల్లో భూకబ్జాల వ్యవహారం ఇప్పుడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్సెస్ కవితగా మారి సరికొత్త వివాదానికి తెరలేపింది. హైదరాబాద్‌లోని 'కోటిచెరువు' శిఖం భూమిని పవన్ కల్యాణ్ కబ్జా చేశారంటూ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. జూబ్లీహిల్స్‌లోని పార్టీ ఆఫీస్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ.. పవన్ గనుక ఆ భూమిని ఆక్రమించలేదని చెబితే, వెంటనే ఆ స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించి, అక్కడి నిర్మాణాలను, మట్టిని తొలగించాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల శాఖ రికార్డుల ప్రకారం ఆ 10 ఎకరాల భూమి పూర్తిగా 'శిఖం' (ప్రభుత్వ) భూమి అని కవిత స్పష్టం చేశారు. కానీ రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం 3 ఎకరాలను మాత్రమే శిఖం భూమిగా చూపి, మిగిలిన 7 ఎకరాలను 'మాగాణి' (ప్రైవేట్) భూమిగా మార్చేశారని.. ఇది స్పష్టమైన నిబంధనల ఉల్లంఘనే అని ఆమె ఎండగట్టారు.ఇటీవల పవన్ చేసిన "తెలంగాణ మీ అబ్బ సొత్తా.. మీ జాగీరా?" అనే

## అసలు నువ్వెవరు?

### ప్రకాశ్ రాజ్‌పై జనసేన నేత తీవ్ర ఆగ్రహం

2లో

షూటింగ్‌లకు ప్రకాశ్ రాజ్ ఎప్పుడైనా సమయానికి వచ్చారా అని నిలదీత

దేశానికి, తెలంగాణకు ఆయన చేసిన సేవ ఏంటని ఎద్దేవా

గద్దర్ విషయంలో పవన్ కల్యాణ్‌ను విమర్శించే హక్కు లేదని వ్యాఖ్య



నటుడు ప్రకాశ్ రాజ్‌పై తెలంగాణ జనసేన నాయకుడు సాగర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జనసేన పార్టీ, ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గురించి

రూ. 4.77 కోట్ల అభివృద్ధి పనులకు వెనిగండ్ల రాము శంకుస్థాపన

ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించడమే తమ ధ్యేయమని వ్యాఖ్య

గతంలో నిర్లక్ష్యానికి గురైన పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని వెల్లడి

2లో

## గుడివాడ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం



కృష్ణా జిల్లా గుడివాడ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. పట్టణ అభివృద్ధిపై వస్తున్న విమర్శలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దీటుగా స్పందించారు.

# కర్ణాటకలో అర్ధరాత్రి హైడ్రామా..

కర్ణాటక కాంగ్రెస్‌లో చల్లారిన అసంతృప్తి సెగ

మంత్రి పదవికి రాజీనామాపై వెనక్కి తగ్గిన రామలింగారెడ్డి

డీకే శివకుమార్ జోక్యంతో గంటల్లోనే సంక్షోభానికి తెర

అర్ధరాత్రి హోటల్‌లో సుదీర్ఘ మంతనాలతో పరిష్కారం

మరో సీనియర్ మంత్రి మునియప్ప సైతం అసమ్మతి గళం వినిపిస్తున్న వైనం

2లో



# గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

సూచించారు. శనివారం నాడు జిల్లాలోని చేబ్రోలు మండలం నారాకోడూరులో సంవృద్ధి కేంద్రాన్ని కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ప్రారంభించారు. 'కేంద్రం ఒక్కటి... సేవలు అనేకం' అనే నినాదంతో ప్రధాని నరేంద్ర మోదీ పని చేస్తున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. సంవృద్ధి గ్రామ కేంద్రంగా నారాకోడూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు చెప్పారు. గ్రామంలో ఎక్కడికీ వెళ్లకుండా ఈ కేంద్రంలో అన్ని సేవలు అందుతాయని అన్నారు. దాదాపుగా 60 టెస్టులు కేంద్రంలో పది నిమిషాల్లో చూస్తారన్నారు. డ్వాక్రా మహిళలకు ఎలా వ్యాపారం చేయాలో నేర్పిస్తారని అన్నారు. పోస్ట్ ఆఫీసు సేవలు ఉంటాయన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. రైతుల ఆదాయం కోసం, భూమి సారం కోసం టెస్టులు చేస్తున్నారన్నారు. పంట పొలాలకు ఎరువు చల్లే విధంగా డ్రోన్ ఏర్పాటు చేశామన్నారు. నారాకోడూరు గ్రామంలో ఉన్న సంవృద్ధి కేంద్రం దేశంలో నంబర్ వన్‌గా నిలవాలని పెమ్మసాని చంద్రశేఖర్ ఆకాంక్షించారు. సంవృద్ధి గ్రామ కేంద్రాన్ని నారాకోడూరు గ్రామంలో పెట్టినందుకు కేంద్రానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ధన్యవాదాలు తెలియజేశారు. ఒక్క కేంద్రంలో అనేక సౌకర్యాలు ఉన్నాయన్నారు. నారాకోడూరు గ్రామంలో ఉన్న పిల్లలను రోజుకి గంట సమయం ఈ కేంద్రంలో గడిపేలా తల్లిదండ్రులు చూసుకోవాలని.. దీని ద్వారా వారి భవిష్యత్తు మెరుగుపడుతుందని వెల్లడించారు. నారాకోడూరు గ్రామంలో ప్రతి ఇంటికి వ్లై÷ సదుపాయం కల్పిస్తున్నారని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి పని చేస్తోందన్నారు. 'మీరు మాకు ఇచ్చిన అధికారాన్ని గ్రామాల అభివృద్ధి, సంక్షేమం కోసం పని చేస్తాం. మాకు కులం లేదు, మా కులం ప్రజలకు సేవ చేయడమే' అని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పేర్కొన్నారు.

# డ్రోన్ దాడులు జరిగినా వెనక్కి తగ్గలేదు..

రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో కీలకమైన అంతర్జాతీయ ఆర్థిక సదస్సు ప్రారంభం కావడానికి కొన్ని గంటల ముందు ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో ఉద్రిక్తత నెలకొంది. ఇలాంటి భయానక పరిస్థితుల్లోనూ, ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా నారా లోకేష్ ఆ సదస్సుకు హాజరై తన నిబద్ధతను, ధైర్యాన్ని ప్రదర్శించారు. భారతదేశం నుంచి హాజరైన ఏకైక రాష్ట్ర ప్రతినిధిగా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరం (స్రా×జుఖీ) ప్రారంభానికి ముందు జరిగిన ఈ డ్రోన్ దాడులతో నగరం చుట్టూ హై-సెక్యూరిటీ అలర్ట్ ప్రకటించారు. ఆ సమయంలో లోకేష్, పలువురు పెట్టుబడిదారులతో సమావేశాల కోసం మాస్కో నుంచి సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు ప్రయాణిస్తున్నారు. మార్గమధ్యంలోనే ఆయనకు దాడుల గురించి సమాచారం అందింది. దీంతో భద్రతాపరమైన సమీక్షలు జరిగాయి. అయినప్పటికీ లోకేష్ వెనక్కి తగ్గలేదు. ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం సదస్సుకు హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా పోటీ పెరుగుతున్న తరుణంలో, ప్రభుత్వాలు ఇచ్చే హామీలు, వాటిని నిలబెట్టుకునే విశ్వసనీయత చాలా ముఖ్యం. ఇది కేవలం ప్రదర్శన కోసం తీసుకున్న నిర్ణయం కాదని, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిన వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలనే దృఢ సంకల్పంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భద్రతా హెచ్చరికల నడుమ సదస్సుకు చేరుకున్న లోకేష్, తన పర్యటనను యథావిధిగా కొనసాగించారు. పలువురు ఇన్వెస్టర్లు, వ్యాపార దిగ్గజాలతో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి అవకాశాలను వివరించారు. డ్రోన్ దాడుల వార్తలు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేసినా, ఏపీ ప్రగతికి అంతరాయం కలగకూడదనే సంకల్పంతో లోకేష్ ముందుకు సాగారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

నీట్ తదితర ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ శనివారంనాడు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనలకు నాయకత్వం వహించగా, ప్రముఖ విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్, పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ ఆరంభం మాత్రమేనని సీజేపీ స్పష్టం చేసింది. సీజేపీ మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకూ నిరసనలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇంకెంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకూ అధికారులు వేచిచూస్తారని నిలదీశారు. తమ డిమాండ్ల నెరవేరేంత వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. నిరసనలకు దిగితే జైలులో పెడతారేమోనని తన తల్లి భయపడినట్టు దీప్కే చెప్పారు. 'తమ పిల్లలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే ఏమవుతుందోనన్న భయం ఈ దేశంలోని ప్రతి తల్లికి ఉంది. ఈ ప్రభుత్వానికి భయపడి ఎంతకాలం బతకాలని ఆయన ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని నెలరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ చర్చలు తీసుకోవడం లేదని, దీనికి బదులు ఇతర అంశాలపైనే వాళ్లు దృష్టి పెట్టారని అన్నారు. సీజేపీ అకౌంట్లు హ్యాక్ చేయడం, పోస్టులు డిలీట్ చేయడం చేస్తున్నారని చెప్పారు. పోస్టులను డీలీట్ చేయవచ్చు కానీ, తమను ఏమార్చలేరని అన్నారు. పేపర్ లీక్‌లు, విద్యావ్యవస్థలో తప్పిదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల పేర్లను ఆయన చదవి వినిపించారు. విద్యార్థుల మృతికి సీజేపీ సంతాపం ప్రకటించింది. జంతర్‌మంతర్ నిరసనల్లో పాల్గొనేందుకు ఆయన అమెరికాలోని బోస్టన్ నుంచి ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను చేత్తో పట్టుకుని కనిపించారు. జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ విద్యాశాఖ మంత్రిగా ఆయన ఉండాలని కోరారు. అయితే తనకు రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆలోచన లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. యువకులే ఆ బాధ్యత చేపట్టాలన్నారు. రాజకీయవేత్తలు, ప్రభుత్వ అధికారుల పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదవాలని తాను కోరుకుంటు న్నట్టు చెప్పారు. సీజేపీ నిరసనలకు ప్రభుత్వం అనుమతించడాన్ని ఆయన స్వాగతించారు. నిరసన తెలపడం తనకు ఇష్టం లేకున్నా న్యాయం కోసమే ఆ పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థలో మార్పు జరగాలని అన్నారు. కాగా, తదుపరి నిరసన ప్రదర్శనను జూన్ 23న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే ఆలోచనలో సీజేపీ ఉంది. ఈ కార్యక్రమంలో వందలాదిమంది యువత పాల్గొని కాక్రోజ్ జనతాపార్టీకి మద్దతగా నిలిచారు.

# అసలు నువ్వెవరు?

మాట్లాడే హక్కు ప్రకాశ్ రాజ్‌కు ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా సాగర్ ఘాటైన విమర్శలు చేశారు. "జనసేన ఒంటరిగా పోటీ చేస్తుందో, పొత్తుతో వస్తుందో ఆయనకెందుకు? అసలు ప్రకాశ్ రాజ్ ఎవరు? మేమెందుకు ఆయనకు సమాధానం చెప్పాలి?" అని సాగర్ సూటిగా నిలదీశారు. ప్రశాంతంగా ఉన్నవారిని కెలకడం ప్రకాశ్ రాజ్‌కు అలవాటని ఆరోపించారు. గద్దర్ అంశంపై మాట్లాడుతూ, "గద్దర్‌ను ఎవరు ఉపయోగించుకున్నారు? పవన్ కల్యాణ్ జేబు నుంచి నేరుగా డబ్బులు తీసుకునేంత చనువు తనకు ఉందని స్వయంగా గద్దరే చెప్పారు" అని ఆయన గుర్తుచేశారు. ప్రకాశ్ రాజ్ వృత్తిపరమైన ప్రవర్తనను కూడా సాగర్ ప్రశ్నించారు. "అసలు ఆయన ఎప్పుడైనా షూటింగ్‌కు సమయానికి వచ్చారా? మీరు ఎంత సహృదయులో మీ చిత్ర పరిశ్రమ వారిని అడిగితే తెలుస్తుంది" అంటూ ఎద్దేవా చేశారు. ఈ దేశానికి, ప్రత్యేకించి తెలంగాణకు ప్రకాశ్ రాజ్ చేసిన తోడ్పాటు ఏమిటని సాగర్ ప్రశ్నించారు. "తెలంగాణ సాయుధ పోరాటం, రజాకార్ ఉద్యమంలో పాల్గొని కుటుంబాలను పోగొట్టుకుంది ప్రకాశ్ రాజా?" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "అసలు నువ్వెవరు ప్రకాశ్ రాజ్?" అని సూటిగా ప్రశ్నించిన ఆయన, తెలంగాణకు ప్రకాశ్ రాజ్ చేసిన సేవ ఏంటని నిలదీశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజకీయ వ్యవహారాల్లో తలదూర్చడం ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు.

# కోటిచెరువు భూమిని వెంటనే వెనక్కివ్వు

వ్యాఖ్యలపై కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. "అవును, ఇది కచ్చితంగా మా జాగీరే! 1,200 మంది అమరవీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ ఇది. ఇది తెలంగాణ ప్రజల సొత్తు, ఎవరి ముత్తాతలదో కాదు" అని కవిత ప్రతిస్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజధానిని కూడా నిర్మించలేకపోయిన పవన్.. ఇప్పుడు తెలంగాణలో కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీకి సరైన స్థానిక నాయకులు లేకపోవడం వల్లే పవన్‌ను వాడుకుంటున్నారని విమర్శించారు. ప్రజా గాయకుడు గద్దర్‌కు తాను కారు కొనిచ్చి సాయం చేశానన్న పవన్ వ్యాఖ్యలను కూడా కవిత తప్పుబట్టారు. నైజాం ఏరియా నుంచి తన సినిమాల ద్వారా కోట్లాది రూపాయల రెవెన్యూ సంపాదిస్తున్న పవన్.. ఇక్కడి జానపద కళాకారులను గానీ, చిన్న నిర్మాణాత్మక శక్తులను గానీ ఎప్పుడైనా ఆదుకున్నారా? అని ప్రశ్నించారు. పైగా జానపద కళాకారుల ట్యూన్లను వాడుకుంటూ వారికి కనీస గుర్తింపు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఆమె ఒక ఆసక్తికరమైన పోలికను తెరపైకి తెచ్చారు. "అప్పట్లో ఖ.ు.= (కేసీఆర్, టి. హరీశ్ రావు, రామారావు (కల్వకుంట్ల తారకరామారావు) పాలన అనుకుంటే.. ఇప్పుడు కూడా నడుస్తోంది ఖ= (కొండారెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి) పాలనే" అంటూ వ్యగ్యంగా కామెంట్ చేశారు. గతంలో దోపిడీకి కిటికీలు తెరిస్తే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా తలుపులే బార్లా తెరిచిందని ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఇలాగే అమ్మేసుకుంటూ పోతే రాబోయే తరాలకు ఏమీ మిగలదని, ఈ ల్యాండ్ స్కామ్‌లన్నింటినీ తాము త్వరలోనే బయటపెడతామని కవిత హెచ్చరించారు.

# కర్ణాటకలో అర్ధరాత్రి హైడ్రామా..

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ తర్వాత చెలరేగిన అసమ్మతి సెగలు తాత్కాలికంగా చల్లారాయి. శాఖల కేటాయింపుపై తీవ్ర అసంతృప్తితో తన మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన సీనియర్ నేత రామలింగారెడ్డి, కొన్ని గంటల వ్యవధిలోనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్వయంగా రంగంలోకి దిగి, ఆయనతో జరిపిన సుదీర్ఘ చర్చలు ఫలించడంతో ఈ సంక్షోభానికి తెరపడింది.

**అర్ధరాత్రి హోటల్‌లో హైడ్రామా** శుక్రవారం రాత్రి రాజీనామా ప్రకటనతో కలకలం రేపిన రామలింగారెడ్డిని బుజ్జగించేందుకు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. జయనగర్‌లోని ఒక ప్రైవేట్ హోటల్‌లో అర్ధరాత్రి దాటాక రామలింగారెడ్డితో ఆయన భేటీ అయ్యారు. పార్టీకి చెందిన మరికొందరు సీనియర్ నేతల సమక్షంలో జరిగిన ఈ మంతనాల తర్వాత వివాదం సద్దుమణిగినట్లు డీకే శివకుమార్ ప్రకటించారు. "శాఖల కేటాయింపునకు సంబంధించి తలెత్తిన కొన్ని సమస్యలపై కూర్చుని మాట్లాడుకున్నాం. ప్రస్తుతం వివాదం పరిష్కారమైంది" అని ఆయన మీడియాకు స్పష్టం చేశారు . తనకు కేటాయించిన నీటిపారుదల శాఖపైనే రామలింగారెడ్డి ప్రధానంగా అభ్యంతరం వ్యక్తం చేసినట్టు డీకే తెలిపారు. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలనే దానిపై స్పష్టమైన అవగాహనకు వచ్చామని పేర్కొన్నారు. "రామలింగారెడ్డి, నేను 1980ల నుంచి మంచి స్నేహితులం. పార్టీలోని సీనియర్లకు సముచిత గౌరవం ఇస్తున్నాం. చిన్న చిన్న అభిప్రాయభేదాలను త్వరలోనే పరిష్కరించుకుంటాం" అని డీకే భరోసా ఇచ్చారు.

**కొనసాగుతున్న అసమ్మతి** రామలింగారెడ్డి వివాదం ముగిసినప్పటికీ, కర్ణాటక మంత్రివర్గంలో అసంతృప్తి పూర్తిగా సమసిపోలేదని తెలుస్తోంది. మరో సీనియర్ మంత్రి కేహెచ్ మునియప్ప కూడా శాఖల కేటాయింపుపై తన సీనియారిటీకి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదంటూ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఇంకా ఉన్నాయనే చర్చ జరుగుతోంది. ఒకవైపు రామలింగారెడ్డిని శాంతింపజేసినా, మరోవైపు మునియప్ప వంటి సీనియర్ నేతల్లోని అసంతృప్తిని కాంగ్రెస్ అధిష్ఠానం ఎలా పరిష్కరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# గుడివాడ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

గుడివాడ అభివృద్ధిపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన సవాల్ విసిరారు. గుడివాడ హెడ్ వాటర్ వర్క్సులో కేంద్ర ప్రభుత్వ నిధులతో రూ.4.77 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రత్యర్థి పార్టీ చేస్తున్న నిరాధార విమర్శలను ప్రజలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, తాము కూడా వాటిని లెక్కచేయబోమని తేల్చిచెప్పారు. గుడివాడ ప్రజలకు దీర్ఘకాలికంగా సురక్షితమైన త్రాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో 35 వేల కుటుంబాలు ఉండగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 55 వేల కుటుంబాలకు సరిపడా నీరు అందేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నూతనంగా నిర్మిస్తున్న సంపు పూర్తయితే హెడ్ వాటర్ వర్క్సు సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని ఆయన వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పనులన్నింటినీ ఇప్పుడు వేగంగా పూర్తి చేస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. తాము కేవలం అభివృద్ధి కార్యక్రమాలపైనే దృష్టి కేంద్రీకరించామని, వ్యక్తిగత విమర్శలకు స్పందించాల్సిన అవసరం తమకు లేదని వెనిగండ్ల రాము కొట్టిపారేశారు.

# టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు వీరే... అధికారికంగా ప్రకటించిన చంద్రబాబు

### తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థుల ప్రకటన
### ముగ్గురి పేర్లను ఖరారు చేసిన టీడీపీ నాయకత్వం
### సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్‌లకు అవకాశం
### అభ్యర్థులను అధికారికంగా ప్రకటించిన చంద్రబాబు

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తమ రాజ్యసభ అభ్యర్థులను ఖరారు చేసింది. ముగ్గురు అభ్యర్థులతో కూడిన జాబితాను పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు శనివారం అధికారికంగా విడుదల చేశారు. జూన్ 18న జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ తరఫున సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ బరిలో నిలవనున్నారు.

వివరాల్లోకి వెళ్తే, రాజ్యసభ అభ్యర్థులుగా పారిశ్రామికవేత్త సానా సతీష్, ప్రముఖ విద్యావేత్త, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, పార్టీ సోషల్ మీడియా విభాగం ముఖ్య నేతగా ఉన్న చింతకాయల విజయ్‌లను ఎంపిక చేసినట్లు పార్టీ ప్రకటించింది. రానున్న ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై కొంతకాలంగా పార్టీ వర్గాల్లో చర్చలు జరగ్గా, చివరికి అధిష్టానం ఈ ముగ్గురి పేర్లను ఖరారు చేసింది. ఈ ముగ్గురిని చంద్రబాబు ఇవాళ తన క్యాంపు కార్యాలయానికి పిలిపించి స్వయంగా బి-ఫారాలు అందజేశారు. వారు సోమవారం నాడు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ మేరకు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం నుంచి అధికారికంగా పత్రికా ప్రకటన వెలువడింది. కాగా, ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవడం తెలిసిందే. కూటమి పొత్తు ధర్మం ప్రకారం నాలుగు స్థానాల్లో ఒకటి జనసేనకు కేటాయించగా, తమ అభ్యర్థిగా జనసేన పార్టీ లింగమనేని రమేష్ పేరును ఖరారు చేయడం తెలిసిందే.

# రాజ్యసభకు లింగమనేని నామినేషన్

రాజ్యసభ అభ్యర్థిగా జనసేన తరఫున లింగమనేని రమేష్ అసెంబ్లీలో నామినేషన్ దాఖలు చేశారు. రమేష్ నామినేషన్ పై ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు తెదేపా ఎమ్మెల్యేలు, ఒక భాజపా ఎమ్మెల్యే సంతకాలు చేశారు. రమేష్ వెంట మద్దతుగా కూటమి ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్ నాయకర్, వంశీకృష్ణ శ్రీనివాస్, దేవ వరప్రసాద్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, కాగిత కృష్ణ ప్రసాద్, నక్కా ఆనంద్ బాబు, ఎన్ ఈశ్వర రావు (బీజేపీ) వెళ్లారు. జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేశ్ నామినేషన్ దాఖలు చేశారు. రమేశ్ నామినేషన్‌ను 10 మంది కూటమి ఎమ్మెల్యేలు ప్రతిపాదించారు. రమేష్ నామినేషన్‌పై ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఒక బీజేపీ ఎమ్మెల్యే సంతకాలు చేశారు. లింగమనేని వెంట మద్దతుగా కూటమి ఎమ్మెల్యేలు వెళ్లారు. జనసేన అభ్యర్థిగా రాజ్యసభకు నామినేషన్ వేసినట్లు రమేశ్ తెలిపారు. తనకు అవకాశం కల్పించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరిచిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు లింగమనేని రమేశ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నిక అయ్యాక అందరితో మరోసారి మాట్లాడుతానని రమేశ్ వెల్లడించారు. ఇదిలావుంటే లింగమనేని రమేశ్ రాజ్యసభకు ఎంపికవడంపై స్వగ్రామం మొవ్వ మండలం పెద్ద ముత్తెవిలో సంబరాలు అంబరాన్నంటాయి. రమేశ్.. గ్రామస్థాయి నుంచి రాజ్యసభ వరకు ఎదిగారని గ్రామస్థులు తెలిపారు. పెదముత్తేవి శ్రీలక్ష్మీపతి స్వామి ఆలయంలో రమేశ్ విజయానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టుదలతో చిన్న వ్యాపారాల నుంచి రమేశ్ ఎదిగారని హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు అన్నారు. రమేశ్‌కు ఇంకా ఉన్నత పదవులు రావాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.

# సహారా ఎడారిలో మృత్యు ఘోష

:పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు. చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ దజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు. విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలసవెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు. గతంలోనూ అనేక మంది ఇసుక వేడి, దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తుచేసుకున్నారు.

# మధ్యనిషేధ హామీని గాలి కొదిలేసిన జగన్

డీఎస్సీ నిర్వహణపై ఆధారాలతో సహ జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌తో గొడ్డలి పార్టీ నేతలు డిఫెన్సులో పడ్డారని చెప్పుకొచ్చారు. దుష్ప్రచారం చేయడం, ఫేక్ రాజకీయాలు చేయడం గొడ్డలి పార్టీ విధానం, సిద్ధాంతమని విమర్శించారు. అధికారంలో ఉన్నామని... సహనం, ఓపిక అవసరమని.. కానీ గొడ్డలి పార్టీ ఆగడాలు శ్రుతిమించితే వదిలిపెట్టమని హెచ్చరించారు. మంచి ఆలోచనలు చేసే వాళ్లకు మంచి వాళ్లే సహాయపడతారని అన్నారు. చెడు ఆలోచనలు చేసే వాళ్ల చుట్టూ గొడ్డలి బ్యాచ్ జమ అవుతుందని ఎద్దేవా చేశారు. ఇకపై టీడీపీకి ఓటమి లేదని, రాదని తెలిపారు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలతో మంచిగా ఉంటున్నామని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నామని.. సంక్షేమ పథకాలు - అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చామని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని.. అందుకే టీడీపీకి ఓటమి రాదని పేర్కొన్నారు. పార్టీ పదవులు మొదలుకుని టికెట్ల కేటాయింపుల వరకు నిరంతరం సర్వేలు చేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వాళ్లని వదిలించుకుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఏం ప్రచారం చేశారో... అవన్నీ తమ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచిని గడప గడపకు వెళ్లి చెప్పాలని దిశానిర్దేశర చేశారు. ఆనాడు చెప్పిన వాటిని ఈనాడు నెరవేరుస్తున్నామనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. మంగళగిరిలో టీడీపీ గెలిచి చాలా కాలమైందని... 2019 ఎన్నికల్లో నారా లోకేశ్ పోటీ చేసినా ఓడిపోయారని ప్రస్తావించారు. ఆ తర్వాత పట్టుపట్టి పనిచేశారని.. 2024లో అద్భుత విజయం సాధించారని ప్రశంసించారు. గెలిచిన తర్వాత కూడా మంగళగిరిలో లోకేశ్ చక్కగా పని చేస్తున్నారని.. ఇప్పుడు మంగళగిరి టీడీపీకి కంచుకోటగా మారిందని చెప్పుకొచ్చారు. యుద్ధాన్ని గెలిపించే బాధ్యత తనదని... తనతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత టీడీపీ శ్రేణులదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ పరంగా చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపుచ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళ్తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు బీజేపీతో పొత్తులో ఉన్నా కూడా ఓట్లు చీలకూడదనే.. టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా వెళ్లడంతోనే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచామని ప్రస్తావించారు. పార్టీ అగ్రనేతలు మొదలుకుని... కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ బ్రాడ్ మైండ్‌తో ఆలోచించాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు.

# ఆరోగ్యకర జీవనానికి ఆర్గానికి వ్యవసాయం



అనంతరం సవిత మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందన్నారు. ఆర్గానిక్ కూరగాయలు ఆరోగ్య రక్షణకు మేలు చేస్తాయన్నారు. క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణకు సేంద్రియ ఆహారం అవసరమని చెప్పుకొచ్చారు. 15 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో ఫామ్ సాగు చేస్తోందని.. రసాయన ఎరువులు లేకుండా కూరగాయలు, ఆకుకూరల సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఇంధన పొదుపు కోసం సైకిల్ వినియోగాన్ని మంత్రి ప్రోత్సహించారు. దగ్గర ప్రాంతాలకు కాలినడకన లేదా సైకిల్‌పై వెళ్లాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంధన వాహనాలు వినియోగించాలన్నారు. ప్రధాని మోదీ పిలుపు, సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుదామని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

# సీపీఐ అగ్రనేత కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 112వ జయంతి



**బేతంచెర్ల జూన్ 6 ( నందిపత్రిక ).** బేతంచర్ల పట్టణంలోని సిపిఐ కార్యాలయం నందు మండల కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన, భూ పోరాట యోధుడు, భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ ) పూర్వ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 112వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించి అనంతరం మాట్లాడుతూ, కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు పేరు చెప్పగానే భూమికోసం, భుక్తి కోసం, శ్రమజీవుల అభ్యున్నతి కోసం జరిగిన అనేక పోరాటాలు ఉద్యమాలు గుర్తుకు వస్తాయి. ఆయన భూస్వామ్య కుటుంబంలో పుట్టినా,తండ్రి ధనిక భూస్వామి అయినా, కామ్రేడ్ రాజేశ్వరరావు ఒక సాధారణ వ్యక్తిగా నిరాడంబరంగా, నిబద్ధతగల కమ్యూనిస్టుగా, తన యావత్ జీవితాన్ని పేదల పోరాటాలకు అంకితం చేశారన్నారు, 1914 జూన్ 6 న దివిసీమ లోని, మంగళా పురం గ్రామంలో జన్మించిన చంద్ర రాజేశ్వరరావు, భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడిగా,అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ప్రముఖ నాయకులుగా గుర్తింపు, గౌరవం పొందారన్నారు, భూస్వాములను, జమీందారులను ఎదిరించి భూమిలేని పేదల పక్షాన నిలిచి, భూమిలేని పేదలలో పేదగా, రైతులు ఆర్థిక సామాజిక అభివృద్ధికి కృషి చేశారని, పేదల హక్కుల కోసం జరిగే పోరాటంలో తెగింపుగా అక్రమాలను, అన్యాయాలను ఎదిరించి నిలబడ్డారన్నారు, సామాజిక అంశాలలో లోతైన ఆలోచనతో సంయమనంగా వ్యవహరించే వారని, స్వగ్రాపం మంగళాపురం అటవీ భూమిగా ఉన్న 5 వేల ఎకరాల భూమిని జమీందారులు అమ్ముకుంటుంటే, దానిని ప్రతిఘటించి గ్రామంలోని పేదలకు ఆ భూమి దక్కేవరకు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు పోరాటాన్ని నిర్వహించారు. స్వగ్రామంలో ప్రారంభించిన భూ పోరాటాన్ని కృష్ణాజిల్లా అంతటా,మునగాల పరగణాలోను తర్వాత కాలంలో దేశవ్యాప్త భూ ఆక్రమణ ఉద్యమంగా మలిచిన మహానాయకుడు చంద్ర రాజేశ్వరరావు.సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా 196970 ప్రాంతంలో దేశవ్యాప్త భూ పోరాటానికి నాయకత్వం వహించారని టాటాలు, బిర్లాలు వంటి పారిశ్రామిక దిగ్గజాల ఆక్రమణలో,లక్షలాది ఎకరాల భూములను ఆక్రమించడం, వేలాది మందిని అరెస్టులు జరిగిన లెక్కచేయకుండా, భూ సమస్యను నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం గుర్తించేటట్లు చేయడంలో ఆయన ప్రముఖ పాత్ర వహించారు. రాజేశ్వరరావు పోరాట పటిమ పట్ల నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం, అనేక రాష్ట్రాలలో భూసంస్కరణ చట్టాన్ని తీసుకు రాగలిగారన్నారు నేటి యువ కమ్యూనిస్టులు ఆయన పోరాట పటిమను వారసత్వంగా చేసుకుని భవిష్యత్తు పోరాటాలకు సమాయత్తం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్,ఎఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్,మధు, ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ప్రదీప్,సిపిఐ నాయకులుఎల్లకృష్ణ,గౌరీ.ఉదయ్,శ్రీను,మనోజ్, గణేష్ ,సూర్య, మహబూబ్, నాగేంద్ర ,బాబు, తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరుముంబై జాతీయ రహదారిపై కారులో మంటలు.



**మర్రిపాడు జూన్ 06నంది పత్రిక :** మర్రిపాడు మండలం నెల్లూరుముంబై జాతీయ రహదారిపై కదిరినాయుడుపల్లి అడవి ప్రాంతంలో ఓ కారు అగ్నికి ఆహుతైంది. ప్రొద్దుటూరు నుంచి పెంచలకోన వెళ్తున్న సమయంలో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి వెంటనే వాహనాన్ని నిలిపివేసి అందరినీ సురక్షితంగా బయటకు తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రయాణికులు కారుకు దూరంగా వెళ్లిన కొద్ది సేపటికే మంటలు మరింత వ్యాపించి కారు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న మర్రిపాడు అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కూడా అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అధిక ఉష్ణోగ్రతలు, వాహనాల సాంకేతిక లోపాల కారణంగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందని, జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులు వాహనాల పరిస్థితిని ముందుగానే తనిఖీ చేసుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని మర్రిపాడు ఎస్సై బలరాం రెడ్డి సూచించారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత.

## కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి.



**బీమవరం బ్యూరో చీఫ్ జూన్ 6 నంది పత్రిక** భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ శారదా దేవి (ఎఫ్.ఏ.సి) తెలిపారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈట్ స్ట్రీట్ సమీపంలోని డివైడర్లపై మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నామని కమిషనర్ తెలిపారు. భవిష్యత్ తరాలకు సంపూర్ణమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మన ప్రకృతిని కాలుష్యం నుండి కాపాడుకుందాం అనే నినాదంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న కాలుష్యం బారి నుండి మన భూమిని కాపాడుకోవడం ప్రతి ఒక్క పౌరుడి కనీస బాధ్యత అని తెలిపారు. పేర్కొన్నారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని, పచ్చని ఆహ్లాదకరమైన పర్యావరణాన్ని బహుమతిగా అందించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతుగా కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.ప్రసాద్, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.



# శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం





**నంద్యాల ప్రతినిధి. జూన్ 06 . (నంది పత్రిక ):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్)లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ పులివెందుల ప్రిన్సిపాల్ డా. విష్ణు వర్ధన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం కార్యక్రమానికి అధ్యక్షత వహించి పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ చెట్ల పెంపకం మరియు ప్రకృతి సంరక్షణకు కట్టుబడి ఉండాలని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి డా. విష్ణు మాట్లాడుతూ వాతావరణ మార్పులు ప్రపంచానికి సవాలుగా మారిన నేపథ్యంలో ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల హెచ్ఓడీలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ప్రతిజ్ఞ చేశారు.

# సద్దల చంద్రశేఖర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఉష మనో వికాస కేంద్రంలో దివ్యాంగులకు అన్నదానం



**నంద్యాల ప్రతినిధి. జూన్ 06 . (నంది పత్రిక ):** హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు సద్దల చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా నంద్యాలలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన చంద్రశేఖర్ రెడ్డి అభిమాని (షఫీ) అలియాస్ చోటు. హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా ప్రతి ఒక్క నిరుపేద ప్రజలకు మరియు వికలాంగులకు, వృద్ధులకు వితంతులకు ప్రతి ఏటా అన్నదాన కార్యక్రమం నిర్వహించడమే కాకుండా వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తూ అంధుల పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అందిస్తూ వారి విద్య బోధనకు సంబంధించిన అనేక పరికరాలు అందించిన గొప్ప సొసైటీ హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ. శనివారం హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా నంద్యాల పట్టణంలోని చామ కాలువ దగ్గర ఉన్న ఉషా మనో వికాస్ కేంద్రం (బర్డ్స్),పాఠశాలలో చంద్రశేఖర్ రెడ్డి అభిమాని చోటు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారు చేస్తున్న సేవలను గుర్తించి స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాన్ని నిరుపేదలకు కడుపునిండా భోజనం పెట్టాలని ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చోటు తెలిపారు. ఆయనతోపాటు రవి ,రమేష్, తిరుపతయ్య, లక్ష్మణ్ ,చిన్న, అశోక్ అభిమానులు పాల్గొన్నారు.




# 50 శాతం సబ్సిడీపై పశుదాణా పంపిణీ




**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 6 :** బండి ఆత్మకూరు మండలంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వ సబ్సిడీపై పశువుల దాణా ను పంపిణి చేస్తున్నట్లు వెలుగోడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు శనివారం సాయంత్రం తెలిపారు. ఏ కోడూరులో పశువుల దానాలు పంపిణీ చేసిన అనంతరం ఎడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో రెండు వెటర్నరీ డిస్పెన్సరీలు, ఐదు రూరల్ లైవ్ స్టాక్ యూనిట్లు, ఏడు రైతు సేవా కేంద్రాలు కలిపి మొత్తం 14 కేంద్రాల ద్వారా ఈ పంపిణీ జరుగుతుందని ఏడీఏ పేర్కొన్నారు. ప్రతి వెటర్నరీ డిస్పెన్సరీకి 50 బ్యాగులు, రూరల్ లైవ్ టాక్ యూనిట్, రైతు సేవా కేంద్రాలకు కల 45 బ్యాగులు చొప్పున మొత్తం 640 బ్యాగుల బస్సు దాణా పంపిణీ అవుతుందని పేర్కొన్నారు. ప్రతి పసి దాణా బ్యాగు ( 50 కేజీలు) మార్కెట్ ధర1,110 రూపాయలు కాగా ప్రభుత్వం 50% సబ్సిడీ అందిస్తుందని అన్నారు. రైతులు కేవలం 555 మాత్రమే చెల్లించి బ్యాగును పొందవచ్చునని అన్నారు. మొత్తం పంపిణీ విలువ 7,10,400 రూపాయలు కాగా, ప్రభుత్వం 3,55,200 రూపాయల సబ్సిడీని భరిస్తుందని అన్నారు. ఇప్పటికే మూడు కేంద్రాలలో పంపిణీ పూర్తయింది అని తెలిపారు. మిగిలిన 11 కేంద్రాలలో ఒక వారం వ్యవధిలో పంపిణీ పూర్తి చేస్తారని సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు వివరించారు.

# దీమమతా బెనర్జీకి, రితబ్రత వర్గానికి మధ్య దూరం పెరిగింది ఈ ఘటనతోనేనా..?

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం అనంతరం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో అంతర్గత సంక్షోభం తీవ్రరూపం దాల్చింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ వైఖరే ఈ దుస్థితికి కారణమంటూ, పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నేతృత్వంలో పలువురు ఎమ్మెల్యేలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. త్వరలో ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల లోపు మరికొంత మంది ఎమ్మెల్యేలు తమ వర్గంలో చేరతారని ఆయన శనివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి, మమతా బెనర్జీ సుదీర్ఘ పాలనకు తెరదించిన నేపథ్యంలో టీఎంసీలో అసమ్మతి సెగలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. పార్టీకి చెందిన మొత్తం 80 మంది ఎమ్మెల్యేలలో సుమారు 58 నుండి 61 మంది రితబ్రత బెనర్జీకి మద్దతు ప్రకటించారు.

# కడమల కాల్వ లో దేవాలయ భూములకు వేలం పాటలు

**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 6 :** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న కడమల కాల్వ గ్రామంలో శనివారం దేవాలయ భూములకు సంబంధించి నిర్వహించిన బహిరంగ వేలం పాటల్లో ఈ ఏడాది ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. గ్రామంలోని శివనందీశ్వర దేవస్థానమునకు సంబంధించి 23.28 ఎకరాలు, శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం కు సంబంధించి 35.12 ఎకరాలు, శ్రీ వెంకటేశ్వర దేవస్థానమునకు సంబంధించి 4.04 ఎకరాలు, శ్రీ భైరవ స్వామి దేవస్థానమునకు సంబంధించి 10.70 ఎకరాల భూమిని ఒక ఏడాది కౌలుకు వేసుకునేందుకుగాను వేలం పాటలు నిర్వహించారు. శ్రీ శివ నందీశ్వర దేవస్థానమునకు సంబంధించి గత ఏడాది కంటే ఈ ఏడాది 6000 ఆదాయం తగ్గిపోయింది. శ్రీ చెన్నకేశవ దేవస్థానమునకు సంబంధించి 56వేల రూపాయలు, శ్రీ భైరవ స్వామి దేవస్థానమునకు సంబంధించి 56 వేల రూపాయల ఆదాయం తగ్గిపోయింది. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానమునకు సంబంధించి గత ఏడాది 1,66,000 వేల రూపాయలకు వేలంపాట జరుగగా, ఈ ఏడాది కూడా అదే స్థాయిలో వేలంపాట జరిగింది. ఈ దేవస్థానమునకు సంబంధించి ఎలాంటి ఆదాయం పెరగలేదు. బహిరంగ వేలంపాటలకు పర్యవేక్షణాధికారిగా నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి పి హరిచంద్ర రెడ్డి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగప్రసాద్, ఆలయ చైర్మన్లు మద్దిగారి పుష్పరాజు, ఏ బాలన్న, ధర్మకర్తల మండలి సభ్యులు మద్దిగారి చిన్న పాపయ్య, మద్దిగారి భూపాల్,దేవస్థానం సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు. వేలం పాటలు ప్రశాంతంగా జరిగేందుకు ఎస్ఐ జగన్ మోహన్, పోలీస్ సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు.



## క్షయ వ్యాధి నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం.

### తొట్టిగారి పల్లె వైద్య అధికారి రాజేష్ కుమార్.



**బద్వేల్, జూన్ 6 (నంది పత్రిక)** క్షయ వ్యాధి నిర్మూలనే, ప్రభుత్వ ధ్యేయమని తొట్టిగారి పల్లె వైద్యాధికారి రాజేష్ కుమార్ అన్నారు. బద్వేల్ మండలం, చింతలచెరువులో హ్యాండ్ హెల్త్ ఎక్స్రే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో దాదాపు 100 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిగాయి. ప్రతి వ్యక్తికి భగవంతుడు మంచి ఆరోగ్యం ఇచ్చాడని, ఆరోగ్యాన్ని త్రాగడం గుట్కా వేసుకుని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకుని, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. 2030 నాటికి టీబీ వ్యాధిని అంతమొందించాలని, ప్రభుత్వ ధ్యేయంమన్నారు. 60 సంవత్సరాలు పైబడిన, సిగరెట్, గుట్కా, మద్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, పౌష్టిక ఆహార లోపం కలిగిన వారు, టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ వ్యాధి నిర్ధారణ అయితే భయపడవలసిన అవసరం లేదని, మంచి మందులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ చంద్రావతి, టీబీ సూపర్వైజర్ నరసింహ ప్రసాద్ ,బ్రహ్మారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్ రావు, సిహెచ్వోలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## ప్రాథమిక చికిత్స కాదని ఆర్ఎంపీలు వైద్యం చేస్తే చర్యలు తప్పవు.

### డిప్యూటీ డిఎంహెచ్వో మల్లేష్..



**బద్వేల్, జూన్ 6 (నంది పత్రిక ):** ఆర్ఎంపీలు వైద్యం చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని, డిప్యూటీ డిఎంహెచ్వో మల్లేష్ అన్నారు. బద్వేల్ పట్టణంలోని గత రెండు రోజులుగా ఆర్ఎంపి వైద్యశాలలు, మెడికల్ షాపులను తనిఖీలు నిర్వహించారు. ఎక్కడైనా సెలైన్ బాటిల్స్, సూదులు వేస్తున్నారా అని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ, ఎవరైతే చట్టాన్ని అతిక్రమిస్తారో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య బృందం నిరంతరం ఆర్ఎంపి వైద్యశాలలను తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వీరు సూది , సెలైన్ పెట్టిన కఠిన చర్యలు తీసుకోవడమే కాక, ఆసుపత్రిని సీజ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోపవరం వైద్యాధికారి మహేశ్వర్ రెడ్డి, తొట్టిగారిపల్లి వైద్య అధికారి రాజేష్ కుమార్ గాంధీనగర్ వైద్య అధికారి శరత్ చంద్ర, వైద్య సిబ్బంది జనార్ధన్ రావులు పాల్గొన్నారు.

## అత్యవసర వేళ రక్తదానం..

### మహిళకు ప్రాణదానం చేసిన యువకుడు



**పోరుమామిళ్ల, జూన్ 6: (నంది పత్రిక)** రక్తదాతలే నిజమైన ప్రాణదాతలని మరోసారి నిరూపిస్తూ పోరుమామిళ్లలో ఓ యువకుడు అత్యవసర సమయంలో రక్తదానం చేసి మహిళ ప్రాణాలను కాపాడేందుకు అండగా నిలిచాడు. మండలానికి చెందిన మహబూబ్ బి అనే మహిళ శస్త్రచికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బి పాజిటివ్ రక్తం అత్యవసరంగా అవసరమైంది.దీంతో బాధిత కుటుంబ సభ్యులు రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులను సంప్రదించారు. సమాచారం అందుకున్న వెంటనే ట్రస్ట్ సభ్యులు షేక్ నాయబ్ రసూల్, పురం ప్రసాద్ స్పందించి పోరుమామిళ్లకు చెందిన కలసపాటి సుధాకర్‌ను సంప్రదించారు. ఆయన వెంటనే ముందుకు వచ్చి బి పాజిటివ్ రక్తాన్ని దానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. ఇప్పటికే ఆరు సార్లు రక్తదానం చేసిన సుధాకర్‌ను ట్రస్ట్ ప్రతినిధులు అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ప్రాణాలను కాపాడేందుకు యువత ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. రక్త అవసరాల కోసం 8125991900 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## భక్తులు, ప్రజలు రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మరింత మెరుగ్గా చేపట్టండి .

### కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి.



**తిరుపతి బ్యూరో చీఫ్ జూన్ 6 నంది పత్రిక** నగరంలో ప్రధాన కూడళ్ళు, భక్తులు, ప్రజల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మరింత మెరుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా శనివారం ఉదయం రైల్వేస్టేషన్, ఎస్.వి. నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. దుకాణాల వద్ద, అపార్ట్మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్ ల వద్ద చెత్త కుప్పలు ఎక్కువగా ఉంటున్నాయన తెలిపారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రతి దుకాణం వద్ద చెత్త కుండీలు ఏర్పాటు చేసుకుని తడి, పొడి చెత్త వేరు చేసి తమ సిబ్బందికి ఇవ్వాలని తెలిపారు. మనల్ని అనారోగ్యం పాలు చేస్తున్న ప్లాస్టిక్ కవర్లు వంటివి వినియోగించరాదని, వినియోగిస్తే జరిమానాలు విధిస్తామని దుకాణదారులను హెచ్చరించారు. కాలువల్లో ఉన్న చెత్త, మట్టి శుభ్రం చేసి మురుగునీరు సజావుగా వెళ్లేలా చూడాలని ఇంజినీరింగ్, పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. లలిత, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, స్వర్ణవార్డు సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.



## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి శేషిధర్.




**రుద్రవరం ప్రతినిధి జూన్ 06 (నంది పత్రిక):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లా స్థాయిలో 05/06/2026 నిర్వహించిన వ్యాస రచన పోటీలలో రుద్రవరం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి శేషిధర్ ద్వితీయ స్థానం సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూపర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సంరక్షణ మరియు హరితాభివృద్ధి అంశాలపై నిర్వహించిన ఈ పోటీలలో తన ప్రతిభను చాటుకున్న శేషిధర్ జిల్లా స్థాయిలో రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో డిప్యూటీ డీఈఓ శంకర్ ప్రసాద్,జిల్లా అధికారులు చేతుల మీదుగా ప్రశంసాపత్రం మరియు బహుమతిని అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొని విజేతలను అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు విద్యార్థి శేషిధర్‌ను అభినందిస్తూ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలలో విద్యార్థులు చురుకుగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే వ్యాస రచన పోటీలకు విద్యార్థిని సిద్ధం చేయడంలో విశేష కృషి చేసిన సైన్స్ ఉపాధ్యాయురాలు సుప్రియ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థి సాధించిన ఈ విజయంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేయగా, ఉపాధ్యాయులు మరియు సహ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## ఉపాధి కూలీలకు పని చేసేచోట కనీస సౌకర్యాలు కల్పించాలి.

### రెండుసార్లు ఫోటో యాప్ ను రద్దు చేయాలి...

### ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ




**బనగానపల్లె జూన్ 6 నందిపత్రిక** ఉపాధి హామీ కూలీలు పనిచేసే చోట కూలీలకు కు కనీస సౌకర్యాలు కల్పించి, రెండు సార్లు తీస్తున్న ఫోటో యాప్ను రద్దు చేయాలని. జి రాంజీ నూతన చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధి గా కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి. ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ మండల కార్యదర్శి ఏ శివయ్య. డిమాండ్ చేశారు.స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ మండల కార్యదర్శి. ఏ శివయ్య ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సంజీవులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కార్మికులు మండుటెండల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు.పనిస్థలాల్లో మజ్జిగ, తాగునీరు, నీడ, మెడికల్ కిట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని అవి లేక పోవడంతో ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు వడదెబ్బకు గురై త్రీవ ఇబ్బందులకు గురవుతున్నారని కొంతమంది కోలుకో లేక మృతి చెందడం జరిగిందని ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ఉపాధి కూలీలకు రెండు సార్లు నిర్వహిస్తున్న ఫోటో యాప్ ని రద్దు చేయాలని చిన్నపిల్లల సంరక్షణ, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు కూడా కల్పించాలని.ఉపాధి కూలీలకు వేతనాలు సకాలంలో వారం వారం చెల్లించి, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని జి రాంజీ నూతన చట్టాన్నిరద్దు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పాతచ ట్టాన్ని కొనసాగించాలని పనిముట్లు.వేసవి అలవెన్స్ లను పునరుద్దరణ సేయాలని డిమాండ్. చేశారు సమావేశంలో కొలిమిగుండ్ల కార్యదర్శి సూర్యనారాయణ పెద్దయ్య పాల్గొన్నారు

## సంగమేశ్వర క్షేత్రంలో తెలంగాణ హైకోర్టు జడ్జీ



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండల పరిధిలోని సప్తనదీ తీరంలో వెలసిన సప్తనదీ ప్రాచీన సంగమేశ్వరాన్ని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జీ సుద్దాల చలపతిరావు కుమారులతో కలసి శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆలయ సంప్రదాయానుసారంగా స్వాగతం పలికారు. ఆయన గర్భాలయంలోని వేపదారు శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన. ఇతరత్ర ప్రత్యేక పూజలు చేసుకొన్నారు. అనంతరం ఆలయ పురోహితులు జడ్జీ చలపతిరావుకు ఆలయచరిత్ర, స్థలపురాణం, ఆలయ విశిష్టతను వివరించారు. జడ్జీ కృష్ణాతీర అందాలను తిలకించారు. ఆయన వెంట కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి, ఎస్ఐ జయశేఖర్ ఉన్నారు.



## జీవన సముద్రం



**నంది పత్రిక:** సముద్రం ప్రకృతి వరం చూడటానికి అంధంగా ఉంటుంది.నీలి సముద్రం సముద్రం అలల శబ్ధం ఆత్మకు ఒక సంగీతం లాంటిది అనంతమైన అందంప్రశాంతత లోతులకు ప్రతీక అలలతో హాయిగా సాగుతుంది.మనసుకు స్ఫూర్తినిఓదార్పు మిస్తుంది మనసుకు ఎంతో హాయి నిస్తుంది.సముద్రం మనిషికి స్ఫూర్తిగా నిలుస్తుంది.ఎన్ని కష్టాలువచ్చినఎప్పుడూ ఆగిపోవద్దని చెపుతుంది. నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయిన మనిషికి ధైర్యాన్ని స్థైర్యాన్ని ఇస్తుంది.పడి లేచె అలల ద్వారాఎత్తు పల్లాలు అడ్డువచ్చిన ప్రవహిస్తూనే ఉంటుంది.మనిషి జీవితంలో ఎత్తు పల్లాలు సముద్రంలోనిఅలల లాంటివి వాటిని చూసి కుంగిపోకండివాటిపై సవారీ చేయటం నేర్చుకోవాలి.వాటికి ధైర్యంగా నిలుస్తేనే జీవితంలో విజయాలు సిద్ధిస్తాయనే సందేశాన్ని ఇస్తుంది.సముద్రం అలలు ఎంత ఎత్తుకు ఎదిగినఒదిగి ఉండాలనీ ప్రభోదిస్తుంది.నదులన్నీ వచ్చి తనలో చేరిన తనలో ఉన్న ఉప్పును వీడదు ఎండకు ఆవిరై వెళ్ళిన నీరు వానగా మార్చి మళ్ళీ నేలకు తెస్తుంది.పంటలకుసాగుకు సహాయపడుతుంది.గుండెల్లో తుఫానులు దాస్తూ ప్రశాంతంగా కనపడుతుంది.సుఖ దుఃఖాల మధ్య జీవితాన్ని సాగించడమేమనిషి జీవితమనికష్టసుఖాలకలయికలసంఘుమమే సమాజంతీరని కోరికల తీరంలోపోరాటమే ప్రయాణమనిచాటుతుంది.గుట్టలు గుంతలుప్రవాహానికి అడ్డువచ్చిన ప్రకృతి వికటించినతన దిశను మార్చుతుంది.తీరం దాటి పరిగెడుతుంది.జలచరాలకు పుట్టినిల్లువిలువైన ఖనిజాల నిక్షిప్త నిధి సముద్ర తీరం మనో ప్రశాంతతకుగొప్ప వరం నీటి అంచుకు నడిచి వెల్లి మీ చింతలు అలల్లో వదిలివేయండి.అలలు విరుచుకు పడతాయి.తుపానులు చెలరేగుతాయిఅయినా సముద్రం తన అందాన్ని కోల్పోదుఅలాగే మనిషి కోపాలు బాధలు మనసులో చెలరేగిన సహనాన్ని వదలద్దు సంఘర్షణకు దిగద్దుమనిషి మనసు సముద్రం లాంటి ప్రశాంతతకు కేంద్రంకావాలి ప్రగతికి పురోగతికి దిక్సూచి కావాలి.సమాజంలో సుస్థిరాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలి.నేదునూరి కనకయ్య ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ కాలమిస్ట్ కరీంనగర్.(జూన్8 ప్రపంచ సముద్ర దినోత్సవం సందర్భంగా)

## ఏ కోడూరులో కార్డెన్ అండ్ సెర్చ్



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 6:** నంద్యాల జిల్లా పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఏ కోడూరు గ్రామంలో శనివారం ఉదయం ఎస్ఐ జగన్మోహన్ పోలీసు సిబ్బంది కార్టెన్ అండ్ సెర్చ్ ప్రోగ్రామ్ను నిర్వహించారు. ఈ మేరకు అనుమానితులైన పలువురు వ్యక్తుల ఇళ్లను పోలీసులు తనిఖీ చేశారు. సందర్భంగా రామానాయుడు అనే వ్యక్తి ఇంట్లో పది మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామంలో ప్రజలందరిని సమైక్యపరిచి ఎస్ఐ జగన్మోహన్ సమావేశాన్ని నిర్వహించారు. సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల ఏర్పడే ఆపదలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, రోడ్డు ప్రమాదాల కారణంగా జరిగే నష్టాలను గురించి ప్రజలకు వివరించారు. అపరిచిత వ్యక్తులు, గ్రామాలలో తిరిగేటప్పుడు, ప్రజలు వెంటనే గుర్తించి 100, 112, 1930 నంబర్లకు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ జగన్మోహన్ ప్రజలకు సూచించారు.



## అంగన్వాడి బడి బాట

**జూపాడుబంగ్లా :జూన్ :6: (నంది పత్రిక )** మండల పరిధిలోనే పోతులపాడు గ్రామంలో శనివారం ఐసిడిఎస్ అధికారుల ఆదేశాల మేరకు అంగన్వాడి కార్యకర్త భారతి ఆధ్వర్యంలో అంగన్వాడి బడి పిలుస్తుంది కార్యక్రమములో భాగంగా పురవీధుల్లో ర్యాలీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అంగన్వాడి కార్యకర్త భారతి మాట్లాడుతూ అంగన్వాడీ బడి పిలుస్తోంది" అనేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒక ప్రత్యేక ప్రచార కార్యక్రమము అని దీని ముఖ్య ఉద్దేశం అని బడి బయట ఏ చిన్నారీ ఉండకూడదన్న లక్ష్యంతో మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఆమె తల్లిదండ్రులను కోరారు.అనంతరం ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ప్రయోజనాలు ఆటపాటలతో కూడిన విద్యాబోధన, పౌష్టికాహారం, మరియు వ్యక్తిగత పరిశుభ్రతను నేర్పించడం. జరుగుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఆయా చిన్నారులు పాల్గొన్నారు.



# మూడవరోజు పెట్రోల్ డీజిల్ గ్యాస్ రేట్లను తగ్గించాలి :సిపిఐ







**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో ఈ ప్రాంతాలు రెవిన్యూ నాగిరెడ్డి కాలనీ ఫిషర్స్ కాంపౌండ్ విజయలక్ష్మి నగర్ రామచంద్ర నగర్ ఏరియాలలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రచార ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమాలకి ముఖ్య అతిథులుగా సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ శ్రీనివాసరావు గిడ్డమ్మ బిసన్న నాగరాజు అన్వర్ అశోకు భద్ర కుమారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచినటువంటి గ్యాస్ కమర్షియల్ గ్యాస్ రేట్లను తగ్గించాలని మరియు పెంచాలని ఆలోచన విరమించుకోవాలని గ్యాస్ రేట్లు పెంచడం ద్వారా సామాన్య మధ్యతరగతి పేద కుటుంబాలపై మోయలేని భారాలు పడుతున్నాయని చిన్నచిన్న కుటుంబాలు గ్యాస్ కొని వంటలు చేసుకుని తినే పరిస్థితి లేదని కమర్షియల్ గ్యాస్ పెంచడం ద్వారా హోటల్ యజమానులు హోటల్ వెళ్లే ప్రజల పైన వారు తినే తినుబండారాల పైన భారాలు మోపుతున్నారని తీరా ఎటు చూసినా ప్రజలపైనే భారాలు పడుతున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నోడికి భక్ష పరమాన్నం లేనివాడికి ఎంగిలి మెతుకులు అన్నట్టు పరిపాలన సాగుతున్నది కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజల పైన ఏ మాత్రం ప్రేమ ఉంటే కేంద్ర ప్రభుత్వం పెట్రోలు డీజిల్ పైన విధిస్తున్న 20 రూపాయల ట్యాక్స్ ను రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న 35 రూపాయల ట్యాక్స్ ను ఉపసంహరించుకుంటే మన రాష్ట్రంలో వాహనదారులకు లారీ యజమానులకు 50 రూపాయలకే డీజిల్ 55 రూపాయలకు పెట్రోల్ వచ్చే పరిస్థితి ఉన్నదని దీనిద్వారా రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయని రవాణా ఖర్చులు తగ్గడం ద్వారా నిత్యవసర వస్తువుల ధరలు కూడా తగ్గడానికి అవకాశం ఉన్నదని ఎప్పుడైతే ధరలు ధరలు తగ్గి ప్రజలకు అందుబాటులో నిత్యవసర వస్తువులు ఉంటాయు ప్రజల దగ్గర నుండి కొనుగోలు శక్తి పెరుగుతుందని కొనుగోలు శక్తి పెరగడం ద్వారా మార్కెటింగ్ వ్యవస్థ మెరుగవుతుందని తద్వారా దేశానికి ఆర్థికంగా మెరుగైనటువంటి ఆర్థిక వ్యవస్థ ఉండడానికి అవకాశం ఉన్నదని వారన్నారు పెట్రోలు డీజిల్ గ్యాస్ పైన విధిస్తున్న టాక్సను ఉపసంహరించుకునే వరకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో కలిసొచ్చే వామపక్షాలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తామని వారన్నారు

ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి సురేష్ మధు బువ్వమ్మ మల్లేష్ రాజశేఖర్ ప్రసాదు అశోకు సుధాకర్ బషీర్ జిలేబి గౌస్ లక్ష్మీబాయి శకుంతల షమీం అఖిల్ రాజ్ విహార్ హమాలీలు పాల్గొన్నారు.

# ఘనంగా చంద్ర రాజేశ్వరరావు 112 వ జయంతి వేడుకలు

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** భూ పోరాటాల యోధుడు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పూర్వపు జాతీయ కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 112 వ జయంతి వేడుకలు సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో సిఆర్ భవన్ లో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం లు ముఖ్య అతిథులుగా పాల్గొని సీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా రామాంజనేయులు, జగన్నాథం లు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు 1914 జూన్ 6 తేది కృష్ణాజిల్లా దివిసీమ మండలం లోని మంగళంపల్లి గ్రామంలో ధనిక భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ ఒక సాధారణ వ్యక్తిగా నిరాడంబర, నిబద్ధతగల వ్యక్తిగా పేద ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు పువ్వు పుట్టగానే పరమలిస్తుంది అనే విధంగా సి ఆర్ బెనారస్ కాశీ విశ్వవిద్యాలయంలో చదువు కోసం వెళ్లి కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితుడై 1934 సంవత్సరంలో యంగ్ కమ్యూనిస్టు లేదు ప్రభావంతో కమ్యూనిస్టు పార్టీలో సభ్యుడి గా సభ్యత్వం పొంది ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త గోవర్కర్ బెనారస్ విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర విభాగంలో ట్యూటర్ పనిచేస్తూ విద్యార్థుల మధ్య మతం పేరుతో చిచ్చు పెడతా మైనార్టీల పైన దాడులు చేస్తా ఉంటే దానికి వ్యతిరేకంగా సి ఆర్ యూనివర్సిటీ ట్రైనింగ్ కోర్ ఏర్పాటు చేసి వాటికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు సొంత గ్రామంలో మంగళంపల్లి లో 5 వేల ఎకరాల అటవీ భూమిని చల్లపల్లి జమీందారు అక్రమంగా అమ్ముకుంటా ఉంటే చంద్ర రాజేశ్వరరావు ఆ భూమి పేద ప్రజలకు దక్కాలని భూ పోరాటం నిర్వహించి పేద బడుగు బలహీన వర్గాలకు పెంచాలని ఈ ఉద్యమ స్ఫూర్తితో కృష్ణాజిల్లా అంతట భూస్వాములకు వ్యతిరేకంగా భూ పోరాటాలు నిర్వహించి పేదలకు భూములు పంచారు ఇదే స్ఫూర్తిని ఆయన జాతీయ కార్యదర్శి గా 1969-70 సంవత్సరాలలో దేశమంతటా భూ పోరాటాలు నిర్వహించి టాటాలు, బిర్లాల పారిశ్రామికవేతల ఆధీనంలో ఉన్న లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచేందుకు ఎన్ని నిర్బంధాలు ఎదురైనా పోరాటం నిర్వహించారన్నారు ఈ పోరాటాల ద్వారా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ భూ సమస్యను దృష్టి కేంద్రీకరించడానికి కేంద్ర బిందువు అయ్యాడు అన్నారు అనేక సంవత్సరాలు సిపిఐ జాతీయ ప్రధాన పనిచేయడమే కాకుండా రష్యా కమ్యూనిస్టు ప్రభుత్వం నుండి "ఆర్డర్ ఆఫ్ లెనిన్ ", " ఆర్డర్ డిమిట్రావ్ " వంటి ప్రతిష్టాత్మక అవార్డులు పొందిన చంద్ర రాజేశ్వరరావు ఒక పోరాట యోధునిగా భారత కమ్యూనిస్టు పార్టీ స్థిర స్థాయిగా నిలిచిపోతాడని, భవిష్యత్తు తరాలకు ఒక మార్గదర్శక ఉంటాడని వారు కొనియాడారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ మునెప్ప, నక్కి లెనిన్ బాబు నగర సహాయ కార్యదర్శిలు చంద్ర శేఖర్, శ్రీనివాసరావు, నగర కార్యదర్శి ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగర అధ్యక్షులు నాగరాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కృష్ణయ్య,నగర కార్యదర్శి బి వెంకటేష్, ఏఐటియుసి నగర నాయకులు ఈశ్వర్ అంజి, ఈశ్వర్ రెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు సిపిఐ నగర నాయకులు భద్ర కుమారు, రాజేష్, రవితేజ కుమార్ రాజా, అన్వర్ ఆశలత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు




# సీఎం పర్యటన పనులు త్వరితగతిన పూర్తి చేయాలి





**విధుల పట్ల నిర్లక్ష్యం వహించే**
**సిబ్బందిపై చర్యలు తప్పవు**
**కేటాయించిన విధులలో తప్పిదాలకు**
**సంబంధిత అధికారులే బాధ్యులు**
**పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా చేయాలి**
**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం( పెనుగొండ) బ్యూరో చీఫ్ జూన్ 6 నంది పత్రిక**
జూన్ 8వ తేదీ సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధాంతం పర్యటన సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను శనివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శనివారం ఉదయం నుండి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెనుగొండ మండలం సిద్ధాంతంలో ఏర్పాటు చేస్తున్న సభాస్థలి, హెలిపాడ్, పార్కింగ్ ప్రాంతం, క్యాడర్ మీటింగ్ ప్రాంగణం తదితర ప్రాంతాలను ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి సందర్శించి సంబంధిత అధికారులకు, ఏజెన్సీ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని, కేటాయించిన బాధ్యతల్లో జరిగే తప్పిదాలకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టాదారు పాసు పుస్తకాలు అందజేసే రైతులకు ముందస్తుగా సమాచారం అందించి, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సభకు వచ్చే రైతులు, ప్రజలకు తాగునీరు, వైద్యసేవలు, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రస్తుతం ఎండలు, వేడి గాలులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణంలో తాగునీటి కొరత లేకుండా చూడాలని, వైద్య బృందాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. గ్రామ సభకు హాజరయ్యే రైతులకు అల్పాహారం, భోజన ఏర్పాట్లు నాణ్యతతో నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి తెలిపారు. పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు అమలు చేయాలని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి ప్రతి శాఖ అధికారి సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో ఆర్డీవోలు దాసిరాజు, కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# 7న ఒంటిమిట్ట లో యోగాంధ్ర-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..!

## జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



**కడప, బ్యూరో చీఫ్ జూన్ 6:నంది పత్రిక** ఈ నెల 7వ తేదీన ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం ప్రాంగణంలో.. నిర్వహించే "యోగాంధ్ర -2026" కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని.. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు.రెండు వారాల పాటు "యోగాంధ్ర- 2026"పై నిర్వహించే వివిధ కార్యక్రమాల నిర్వహణపై.. శనివారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబందిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. 12వ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం.. పర్యాటక / ప్రసిద్ధ ప్రదేశాలలో యోగ ప్రదర్శనల కార్యక్రమాల నిర్వహణలో భాగంగా ఈ నెల 7వ తేదీన ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం ప్రాంగణంలో.. యోగాంధ్ర-2026 ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు విరివిగా పాల్గొనేలా ప్రజల్లో అధికారులు ప్రజలను ప్రోత్సహించాలన్నారు.ఈనెల 7వ తేదీ నుండి 21వ తేదీ వరకు "యోగాంధ్ర- 2026" పక్షోత్సవాల్లో నిర్వహించే అన్ని కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు. ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను గుర్తించి అక్కడ యోగ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. యోగా శిక్షణ కోసం జిల్లాలోని ప్రజలందరూ రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులను ఆదేశించారు. జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని.. కోటి మందితో యోగాసనాలు వేయించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందన్నారు.

# వీఆర్వో మహ్మద్ హుస్సేన్ ఆత్మహత్య ఘటన అత్యంత విషాదకరం

## బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు
## అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ




**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** వెంకయపల్లె వీఆర్వో మహ్మద్ హుస్సేన్ ఆత్మహత్య అత్యంత విషాదకరమని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది బోయ క్రాంతి నాయుడు తెలియజేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఈ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఒక ప్రభుత్వ ఉద్యోగి అధికారుల ఒత్తిడిని భరించలేక ప్రాణాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న ఆరోపణలు అత్యంత ఆందోళన కరమైనవి.ఆత్మహత్యకు ముందు ఆయన రాసిన లేఖలో అధికారుల ఒత్తిడే కారణమని పేర్కొన్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించడం ఈ ఘటన తీవ్రతను సూచిస్తోంది. ఈ అంశాన్ని ప్రభుత్వం అత్యంత గంభీరంగా పరిగణించి, నిష్పాక్షికమైన మరియు పారదర్శకమైన విచారణను వెంటనే చేపట్టాలి.ఈ ఘటనకు బాధ్యులైన అధికారులు ఎవరైనా వారిపై చట్టపరమైన మరియు శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాము. అలాగే మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా తక్షణ ఆర్థిక సహాయం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము.

మహ్మద్ హుస్సేన్ కుటుంబ సభ్యులకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తోందని క్రాంతి నాయుడు తెలియజేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ ఈ విషాద ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి నిజాలు వెలుగులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలియజేశారు.

# "ఓట్లు అడిగేటప్పుడు గుర్తొచ్చే మూలవీధి... సమస్యలు వస్తే ఎందుకు కనిపించదు?"



**పోరుమామిళ్ల జూన్ 6: (నంది పత్రిక)** వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని 7వ వార్డు మూలవీధి ప్రజలు గత 15 ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జనసేన మండల అధ్యక్షుడు శీలంశెట్టి లక్ష్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షం కురిసినా వీధంతా చెరువును తలపించేలా మారిపోతుందని, ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికల సమయంలో మాత్రం ఎమ్మెల్యేలకు ఓట్లు కావాలి, సర్పంచ్‌లకు ఓట్లు కావాలి, వార్డు సభ్యులకు ఓట్లు కావాలి. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజల సమస్యలను పట్టించుకునే నాయకుడు ఒక్కరు కూడా కనిపించడం లేదని మండిపడ్డారు. ప్రజలు మురుగు నీటిలోనే జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.ఇప్పుడు చిన్న వర్షానికే ఈ పరిస్థితి ఉంటే రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి మూలవీధిలో డ్రైనేజీ, రోడ్డు సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలు తమ ఓటు విలువను గుర్తించి, ఎవరికీ ఓటు వేయాలి.. ఎవరికీ వేయకూడదో ఆలోచించే సమయం వచ్చిందని హెచ్చరించారు.

# ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలి.. సిపిఐ



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఓర్వకల్ మండల సమితి ఆధ్వర్యంలో ఏపీఐఐసీలో భూములు కోల్పోయినటువంటి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ,అదేవిధంగా ఉప్పలపాడు,కొంతలపాడు గుట్టపాడు, మీదివేముల తదితర గ్రామలలో భూములు కోల్పోనటివంటి రైతులకు చెక్కులు వచ్చినా కూడా ఇంతవరకు మంజూరు చేయలేదు. కావున తక్షణమే మంజూరు చేయాలని శనివారం సిపిఐ ఆధ్వర్యంలో "జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి కి వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో" ఏపీ రైతు సంఘం" రాష్ట్ర కార్యదర్శి కె .జగన్నాథం , సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప ," సిపిఐ ఓర్వకల్ మండల "కార్యదర్శి కామ్రేడ్ . ఏ. రమేష్ , ఓర్వకల్ రైతు సంఘం కార్యదర్శి కే .సుధాకర్ ,ఉప్పలపాడు సిపిఐ లీడర్ , ఆవుల .రాజు, కొంతలపాడు సిపిఐ లీడర్ చంద్ర ,రైతు సంఘం నాయకులు రాముడు తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బి ఏ యస్ ) పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలి

## కాంగ్రెస్ పార్టీ కోడుమూరు అసెంబ్లీ ఇంచార్జ్ అనంతరత్నం మాదిగ

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** శనివారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో కోడుమూరు నియోజకవర్గం అసెంబ్లీ ఇంచార్జ్ అనంతరత్నం మరియు ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం సుంకన్న మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్ యు శేషయ్య ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది **ఈ సమావేశంలో అనంతరత్నం మాట్లాడుతూ** పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బి ఏ యస్ ) పథకం ద్వారా కార్పొరేట్ స్థాయి పాఠశాలల్లో చదివే అవకాశం కల్పించబడింది. ఈ పథకం ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు రూపొందించబడింది అయితే, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేయడం వల్ల వేలాది మంది పేద విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమయ్యారని కాంగ్రెస్ పార్టీ ఆవేదన వ్యక్తం చేస్తోంది ఈనాటి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆనాడు ప్రతిపక్ష హోదాలో అసెంబ్లీలో నిండు సభలో జగన్మోహన్ రెడ్డి ఎస్సీ ఎస్టీలకు తొలగించిన పథకాలన్నీ మా ప్రభుత్వం వస్తే వెంటనే పునరుద్ధరిస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పాడు మరి ఈనాడు కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అయిపోయిన ఎస్సీలకు సంబంధించిన ఎటువంటి స్కీమును పునం ప్రారంభించలేదు మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపుతామని, విద్యా అవకాశాలను విస్తరింపజేస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలయిపోయింది ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు మంత్రి లోకేష్ బాబు ఈ విద్యా సంవత్సరంలోనే బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బి ఏ యస్ ) పథకాన్ని తిరిగి ప్రారంభించి, పేద మరియు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని మరియు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు లింకుడు ఎన్ ఎస్ ఎఫ్ డి సి క్రింద లోన్లు మంజూరు చేసి ఎస్సీ కుటుంబాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాము అని మాట్లాడారు.



# లోపాలు లేని పట్టాదారు పాస్ పుస్తకాలనే రైతులకు అందజేయాలి

## సీఎం పర్యటనకు అన్ని శాఖలు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి

## జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి



**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 6నంది పత్రిక** రాష్ట్ర ముఖ్యమంత్రి జూన్ 8న పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శనివారం గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభలకు నర్సాపురం డివిజన్ పరిధిలోని 24 గ్రామాలకు చెందిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్న రైతులు హాజరుకావాలని సూచించారు. పాస్ పుస్తకాలలో ఎటువంటి పొరపాట్లు లేకుండా ముందస్తుగా పరిశీలించి రైతులకు అందించాలని వీఆర్వోలను ఆదేశించారు. గ్రామ సభకు వచ్చేందుకు రైతులను బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, చంటి పిల్లల తల్లులు, ఆరోగ్య సమస్యలున్న వారు సభలకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎవరినీ బలవంతంగా కాకుండా స్వచ్ఛందంగా వచ్చే వారినే కార్యక్రమానికి తీసుకురావాలని స్పష్టం చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా రైతులకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, స్నాక్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతి బస్సుకు ఒక క్లస్టర్ అధికారిని నియమించి రైతులు సురక్షితంగా సభకు చేరుకుని తిరిగి ఇళ్లకు వెళ్లే వరకు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. సభకు సుమారు 3,500 మంది రైతులు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని అధికారులను ఆదేశించారు.

# మహిళలకు జరిగే అత్యాచారాలపై శక్తి టీం అవగాహన ఉపాధి కూలీలకు




**గడివేముల నంది పత్రిక** నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్స్ ప్రసాదు వెంకటేశ్వర్లు రఫీ మహిళా పోలీస్ లక్ష్మీదేవి అయిన మేము ఎస్పీ గారి ఆదేశాల మేరకు ఏ ఎస్ పి గారి ఉత్తర్వుల మేరకు అంగన్వాడి టీచర్లతో పాటు గడివేముల మండలం కొరట మద్ది గ్రామంలోని ఎనర్జీఎస్ ఉపాధి పనులకు వచ్చిన మహిళలకు శక్తి యాప్ గురించి శక్తి యాప్ నంబర్ 7993485111 నువ్వు తెలిపి నేటి సమాజంలో జరిగే నేరాల గురించి మహిళలపై జరిగే అత్యాచారాల గురించి వివరించి ఎవరైనాను మహిళల పట్ల చెడుగా ప్రవర్తించెను దురుసుగా నడుచుకొనిన యెడల వెంటనే ఎమర్జెన్సీ కాల్ 112 100 లకు ఫోన్ చేయవలెనని తెలిపి బాల్యవివాహాలు చిన్న పిల్లలపై నేరాలు జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు ఫోన్ చేయవలెనని మహిళలపై అత్యాచారం జరిగినచో 181 కు తెలుపవలెనని సైబర్ నేరములు జరిగినచో 1930 కి ఫోన్ చేసి తెలుపవలెనని ఏపీకే ఆప్స్ ఫేక్ యాప్స్ వచ్చినచో ఓపెన్ చేయరాదని వాటి వలన జరిగే ఆర్థిక నష్టాల గురించి వివరించి వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను తెలిపి శక్తి టీముల పనితీరును వివరించి మహిళల భద్రత మరియు రక్షణ పోలీసుల ధ్యేయమని ఫోక్సో చట్టాలు మరియు నూతన చట్టాల గురించి తెలిపి ఆపద సమయంలో శక్తి యాప్ నంబర్ను ఉపయోగించుకొనవలనని ప్రతి మహిళల మరియు అమ్మాయిల మొబైల్ లందు శక్తి యాప్ ఉండవలెనని దాని వలన ఉపయోగములను తెలిపి మగవారు మోటార్ సైకిల్ నడుపునప్పుడు డ్రైవింగ్ లైసెను కలిగి ఉండవలయునని మద్యం సేవించి మోటార్ సైకిల్ నడపరాదని హెల్మెట్ తప్పక ధరించవలయునని చెప్పి అక్కడ ఉన్న మహిళలకు శక్తి యాప్ డౌన్లోడ్ చేయించి ఇంటికి వెళ్లిన తర్వాత తమ అమ్మాయిలకు బంధువులకు శక్తి యాప్ డౌన్లోడ్ చేయించవలెనని శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకునే విధానం తెలిపి అవేర్నెస్ ప్రోగ్రాం చేయడమైనది

# విద్యుత్ తీగలు తగిలి మహిళ మృతి

## స్తంభం నేలకొరిగి విద్యుత్ తీగ నేలమీద పడ్డా పట్టించుకోని విద్యుత్ శాఖ



**కొలిమిగుండ్ల జూన్ 6నందిపత్రిక** కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డి పల్లె గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది విద్యుత్ తీగలు తగిలి వాసం శెట్టి లక్ష్మీదేవి (60) భర్త పెద్ద వెంకట రాముడు అనే మహిళ మృతి చెందింది. గ్రామస్తులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు లక్ష్మీదేవి అనే ఆమె శుక్రవారం చింతసిగురు కోసం వారు నివసిసుతున్నచోటు నుండి శివాలయం వెనుక ఉన్న చెట్టు వద్దకు వెళ్ళింది. అయితే అప్పటికే అక్కడ విద్యుత్ స్తంభం నెలకొరిగి తీగ నేల మీద పడింది ఇది గమనించని ఆమెకు విద్యుత్ సప్లయి ఉన్న తీగ తగలడంతో అక్కడిక్కడే ప్రాణాలు వదిలింది. విషయం తెలియని కుటుంబ సభ్యులు ఆమె ఇంటికి రాకపోయేసరికి వెదకడం ప్రారంభించారు. శనివారం కరెంట్ స్తంభం వద్ద ఆమె చనిపోయి ఉండడం గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .

**విద్యుత్ వాళ్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రమాదానికి కారణం**

**స్తంభం నెలకొరిగి రెండు రోజులు అయినప్పటికీ పట్టించుకోని లైన్ మెన్**

ఈ ప్రమాద సంఘటనలో విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనపడుతుందని నిర్లక్ష్యం వల్లే ఒక మహిళ ప్రాణాలు కోల్పోయిందని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి లైన్ మెన్ కిందపడ్డ స్తంభాన్ని సరిచేసి ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదని వాపోయారు.

# పేపర్ క్రాఫ్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం



**పోరుమామిళ్ల, జూన్ 6 (నంది పత్రిక ):** ఏప్రిల్ నెల 28 నుండి జూన్ 6 వరకు 40 రోజుల పాటు పోరుమామిళ్ల గ్రంథాలయంలో జరిగిన సమ్మర్ క్యాంపులో లైబ్రేరియన్ ఆఫ్రిది , యు టి యఫ్ నాయకులు చెన్నయ్య ఆధ్వర్యంలో వేడుకలు శనివారం ఘనంగా ముగిసాయి. సమ్మర్ క్యాంపులో జూన్ 4 వ తేదీ లైబ్రేరియన్ ఆఫ్రిది మరియు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు ఖాసీం వల్లి ల ఆధ్వర్యంలో పేపర్ క్రాఫ్ట్ నిర్వహించడం జరిగింది. ఈ పేపర్ క్రాఫ్ట్ లో గెలుపొందిన విద్యార్థులకు యు టి యఫ్ చెన్నయ్య బహుమతులు పంపిణీ చేశారు .40 రోజులపాటు విద్యార్థులు వేసవి సెలవులలో గ్రంథాలయానికి వచ్చి వినోదం విజ్ఞానం పొందడం హర్షనీయమన్నారు .సెలవు దినాలలో సైతం విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి అందుబాటులో ఉన్న పుస్తకాలను చదవాలన్నారు . లైబ్రేరియన్ ఆఫ్రిది మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించిన చెన్నయ్య , విశ్రాంత ఏడిఓ ఏ .వెంకటస్వామి ,సంఘ సేవకులు చంద్రశేఖర ఆచారి సేవలను ప్రశంసించారు . జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు ఖాసీం వల్లి మాట్లాడుతూ సమ్మర్ క్యాంపును హాజరైన విద్యార్థులకు ఆర్పీల సహకారంతో పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు ఆలమరి వెంకటస్వామి ,ఖదీర్ భాష ,రమణయ్య ,సుబ్బారావు ,సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పేదల భూముల్లో పెత్తందారుల మట్టి తవ్వకాలు

## శిరివెళ్ల పరిధిలో అక్రమ తవ్వకాలు

## ఆపకుంటే 8న తాసిల్దార్ కార్యాలయం ముట్టడి.



**శిరివెళ్ల : (నంది పత్రిక)** సిరివెళ్ల మండల కేంద్రము లోని శిరివెళ్ల పొలిమేరపరిధిలో సర్వేనెంబర్ 1022 నందు 6ఎకరాల ప్రభుత్వ భూమిని ఇసుకపల్లె గ్రామంలోని 15 కుటుంబాల నిరుపేదలు సాగు చేసుకుంటున్న భూమిపై పెత్తందారులు అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్నారని రైతు సంఘం మండల కార్యదర్శి డి మౌలాలి ఇసుకపల్లి గ్రామ సిపిఐ శాఖ కార్యదర్శి జి మధు సహాయక కార్యదర్శి కె పాములేటి పేర్కొన్నారు. పేదలు సాగులోకి తెచ్చుకున్న ప్రభుత్వ భూమిపై ఓర్వలేని సారెడ్డి ప్రతాప్ రెడ్డి దౌర్జన్య. కాండ సృష్టిస్తున్నారని శనివారం వారు పత్రిక ప్రకటన విడుదల చేశారు. పేదలను భయభ్రాంతులకు గురి చేస్తూ భూమి జోలికి వస్తే చంపేస్తా అంటూ అక్రమంగా దౌర్జన్యంగా జెసిబి మరియు ట్రాక్టర్లు సహాయంతో కొట్టాలపల్లె గ్రామం వైయస్సార్సీపి నాయకుడు సారెడ్డి.ప్రతాప్ రెడ్డి అతని అనుచరులు కలసి మట్టిని యదేచ్ఛగా తరలించుకుపోతున్నట్లు పేర్కొన్నారు. మట్టి తవ్వకాల గురించి విఆర్.వో భాస్కర్ రెడ్డి.గ్రామ తలారికి తెలియజేసినప్పటికి తవ్వకాలను ఆపే ప్రయత్నం చేయకపోగా మరింత ప్రోత్సహించే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సాగు భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు జరిగితే భూ కబ్జా కేసులు నమోదు చేయాల్సిన రెవెన్యూ అధికారులు లోన మట్టి మాఫియా ప్రోత్సాహం బయటికి మాత్రం సర్వే కొలతలు అంటూ కప్పి పెడుతున్నారని ఆరోపించారు. నిరుపేదలు సాగు చేసుకొనుచున్న భూములపై జెసిబి ట్రాక్టర్లు పెట్టి మట్టిని తరలిస్తున్న వారిపై ఎందుకు ఆపడం లేదను.కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. తక్షణమే తహసీల్దార్ స్పందించి అక్రమ తవ్వకాలు చేస్తున్న సారెడ్డి ప్రతాప్ రెడ్డి పై కేసు నమోదు చెయ్యకుంటే సాగు చేస్తున్న నిరుపేద రైతులను వెంటపెట్టుకొని సిపిఐ పార్టీ మరియు రైతు సంఘం ఆధ్వర్యంలో 08.06.2026 తేదిన తహసీల్దార్ కార్యాలయాన్ని పెద్ద ఎత్తున ముట్టడిస్తమని శిరివెళ్ల మండలం రైతు సంఘం కార్యదర్శి డి.మౌలాలి ఇసుకపల్లె గ్రామ సిపిఐ శాఖ కార్యదర్శి జి.మధు సహాయక కార్యదర్శి కె.పాములేటి హెచ్చరించారు.

# నాటుసారా తయారీ మానుకోండి కొండమనాయుని పల్లె లో ఎక్సైజ్ అధికారుల సదస్సు

**అవుకు జూన్ 6నందిపత్రిక** నాటుసారా తయారీ మరియు విక్రయాల వంటి అనైతిక, చట్టవిరుద్ధమైన పనులను పూర్తిగా మానుకొని, సమాజంలో గౌరవప్రదమైన నాగరిక జీవనాన్ని సాగించాలని ఎక్సైజ్ అధికారులు గ్రామస్తులకు సూచించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్ ఆదేశాల మేరకు శనివారము కొండమ నాయిని పల్లె గ్రామంలో నాటుసారా తయారీదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నాటుసారా తయారీని విడిచిపెట్టిన వారికి ప్రభుత్వం తరఫున పునరావాసం కల్పించడంతో పాటు, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు ఈ సమావేశంలో అధికారులు కాలనీ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులను, సమావేశంలో అధికారులు అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అందేలా చూస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ, నాటుసారా రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, పాత జీవితాన్ని విడిచిపెట్టి పిల్లల భవిష్యత్తు కోసం నాగరిక సమాజంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం కల్పించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, సెర్ప్ (సెర్ప్ ), మరియు హార్టికల్చర్ సిబ్బంది, కొందామానాయని పల్లె ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎరువులను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలి,

## అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తప్పవు: ఏ ఓ స్వాతి

**వెలుగోడు, జూన్ 06 (నంది పత్రిక):** ఎమ్మార్పీ ధరలకె రైతులకు విక్రయించాలని, ఎరువులతో పాటు ఇతర ఉత్పత్తులను లింకు చేసి విక్రయించడం, అధిక ధరలు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడుతే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని వెలుగోడు మండల వ్యవసాయ అధికారి స్వాతి తెలిపారు. శనివారం వెలుగోడు పట్టణంలో ని స్థానిక శ్రీనివాస అగ్రో ఏజెన్సీ ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉత్పత్తుల నిల్వలు, విక్రయ రికార్డులు, ధరల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో స్వాతి మాట్లాడుతూ ప్రతి ఎరువు దుకాణంలో నోటీసు బోర్డుపై మందులు, పురుగుమందులు, విత్తనాల నిల్వలు, వాటి ధరల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని అన్నారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతి సరుకుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన ఎరువులు అందించాలని డీలర్లు ఈ నిబంధనలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.



## ఉపకమిషనర్ & శ్రీ మద్దులేటి స్వామి ఈఓకు కురువ సంఘం ఘన సన్మానం.





**బేతంచెర్ల జూన్ 6 (నంది పత్రిక )** నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్.రంగాపురం గ్రామంలో వెలసిన ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం లక్షలాది భక్తుల ఆరాధ్య దైవం శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము ఉప కమిషనర్ & ఆలయ కార్య నిర్వహణ అధికారిగా సేవలందించిన ఎం. రామాంజనేయులు కర్నూలు జిల్లా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్గా పదోన్నతి పొంది బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా కురువ సంఘం నాయకులుమద్దిలేటి, రాజేష్,వెంకట రమణ తదితరులు ఎం. రామాంజనేయులును శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. సంతోషం వ్యక్తం చేశారు. శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కుమ్మరి సంఘం నాయకులు కొనియాడారు.శ్రీ మద్దులేటి స్వామి ఆలయ నిర్వహణలో క్రమశిక్షణ, భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో చూపిన చిత్తశుద్ధి అభినందనీయమనిఆయన సేవలను కొనియాడుతూ అభినందించారు. కొత్త బాధ్యతల్లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేసి,దేవాదాయ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## వైసీపీ సానుభూతి పరుల ఓట్లు తొలగించకుండా చూసుకోండి



**కొలిమిగుండ్ల జూన్ 6నందిపత్రిక** కొలిమిగుండ్ల మండల కేంద్రం జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కార్యాలయం ఆవరణం లో శనివారం మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో సర్ కార్యక్రమం పై ఓటర్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బియల్ ఏ లకు సర్ కార్యక్రమం పై అవగాహన కల్పించారు.వైఎస్సార్ పార్టీ సానుభూతిపరుల ఓట్లను తొలగించకుండా చూసుకోవడమే మీ విధి అని ప్రతి వైఎస్సార్సీపీ పార్టీ బియల్ ఏ జాగ్రత్తగా వ్యవహరించండని దొడ్డిదారిన మళ్ళీ అధికారంలోకి రావడానికి చూస్తున్న చంద్రబాబు కుట్రలు పాలించకుండా జాగ్రత్త గా ఉండాలని సూచించారు.కార్యక్రమం లో జిల్లా పరిషద్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి,సిద్ధంరెడ్డి రామ్ మోహన్ రెడ్డి, సత్తిగారి రామిరెడ్డి, పేరం నందకిశోర్ రెడ్డి, లాయర్ మహేశ్వర్ రెడ్డి, కొలిమిగుండ్ల మండల వైఎస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## బేతంచర్ల మండల సెంటర్ కు చేరుకున్న పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు

### బేతంచెర్ల ఎంఈఓలు సోమశేఖర్ & అబ్రహం.

**బేతంచెర్ల జూన్ 6 ( నంది పత్రిక ).** 2026-27 విద్యా సంవత్సరానికి బేతంచెర్ల మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కొరకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు మండల కేంద్ర మైన బేతంచెర్లకు చేరుకున్నాయి. ఈ విషయాన్ని మండల విద్యాధికారులు సోమశేఖర్ మరియు అబ్రాహాంలు శనివారం నాడు తెలిపారు. మండల అవసరాలకు అనుగుణంగా మొత్తం 39,527 పాఠ్యపుస్తకాలు, 47,645 నోటు పుస్తకాలు అందినట్లు వెల్లడించారు. వీటిని త్వరలోనే సంబంధిత పాఠశాలలకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున మొత్తం 7,015 యూనిఫాంలు కూడా వచ్చాయని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంఈఓలు స్పష్టం చేశారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందాయన్న విషయం తెలుసు కున్న విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, ప్రభుత్వం కృషి చేస్తోందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.



## ప్రజల అర్జీలకు త్వరగా పరిస్కారం చూపండి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



**బనగానపల్లె జూన్ 6నందిపత్రిక** ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు. శనివారం బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం అభివృద్ధితో కూడిన సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అన్నారు. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి తమ అర్జీలు సమర్పించారు.



# విచ్చలవిడిగా ఇసుక దందా..!

### పట్టణంలోని ఒక హోటల్ ని అడ్డగా చేసుకొని ఇసుక దందా.

### అక్రమ ఇసుక వ్యాపారస్తులకు అడ్డగా మారిన ఓ ప్రముఖ హోటల్.




**ఆదోని నంది పత్రిక (ప్రతినిధి)** పట్టణంలో ఎవరికి ఇసుక కావాలన్నా వారిని సంప్రదించాలి. లేనియెడల వేరే వ్యక్తులు ఇసుక సరఫరా చేసిన వారికి మాత్రం కప్పం కట్టాల్సిందే. ప్రజా ప్రతినిధులు మరియు పోలీసులు సంబంధిత అధికారుల అండదండలు ఉన్నాయని పట్టణ ప్రజలు వినికిడి. ఇస్కాసుర్ల చేసే దందా కి ఫిట్నెస్ లేని టిప్పర్లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ పట్టణంలో రోడ్డుపైన వాహనదారులు పోవాలంటే వాళ్ళ కంట్లో ఇసుక కొట్టుకోవాల్సిందే టిప్పర్లకి సరైన పత్రాలు కానీ ఫిట్నెస్ లేని టిప్పర్లను నడుపుతూ పబ్బం గడుపుతున్న ఇసుకాసురులు దీనికి తోడు . గతంలో అధికారులు దాడులు చేపట్టిన ఫలితం లేకుండా పోయిందని ఎవరికి చెప్పాలో అర్థం కాక స్థానిక గృహ నిర్మాణ వ్యక్తులు లబోదిబోమంటున్నారని, దీనిపై ఉన్నది అధికారులు స్పందిస్తారో లేక ఎప్పటిలాగే, తుతూమంత్రంగా దాడులు చేపట్టి అక్రమార్కులకు సహకరిస్తారో వేచి చూడాలని పట్టణం ప్రజలు అంటున్నారు.

# రైతుల కోసమే వంకలో మట్టి

**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోనికొట్టాలపల్లి రైతులు గ్రామ పరిధిలోని వంకలో మట్టి రైతుల కోసం వాడుకుంటున్నట్లు కొట్టాలపల్లి గ్రామ రైతులు పేర్కొన్నారు. పొలాల రస్తాలు శిథిలమై రాకపోకలకు ధాన్యాన్ని తరలించేందుకు ఇబ్బందికరంగా ఉన్నచోట గుంతలుగా మారిన చోట వంకలో మట్టి తోలుకొని పూడ్చుకుంటున్నట్లు కొట్టాలపల్లి రైతులు తెలియజేశారు. కొందరు గిట్టని వారు అవగాహన లేనివారు అక్రమ మట్టి తవ్వకాలు అంటూ ఆరోపించడం వాస్తవం కాదని రైతులు తెలియజేశారు. వర్షాకాలంలో పొలాలకు వెళ్లాలన్నా పొలాలకు మందు బస్తాలు తీసుకొని పోవాలన్నా ఎంత ఇబ్బంది పడుతున్నారు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమ ఊరు తమ ఇతరులు ఇతర గ్రామస్తులు తమపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని ఈ సందర్భంగా రైతులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సారెడ్డి ప్రతాపరెడ్డి, నరసింహారెడ్డి ఇతర 30 మంది రైతులు పాల్గొన్నారు.



## రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



**గడివేముల నంది పత్రిక** గడివేముల మండలం గ్రామంలో పెసరవాయి గ్రామంలో కూటమి ప్రభుత్వం భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ పారదర్శకత కోసం అధికారిక రాజముద్ర తో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తుంది. పెసర వాయి, గ్రామాల్లో రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు రైతులకు పంపిణీ చేసినట్లు గౌరు చలితా రెడ్డి మరియు తహసిల్దార్ ప్రతి రైతుకు పెసరవాయి గ్రామంలోపట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశామని తహసిల్దార్ వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ అగ్రికల్చర్ మిషనరీ డైరెక్టర్ వడ్డు లక్ష్మీదేవి, మండల టిడిపి అధ్యక్షులు దిలీప్ కుమార్ రెడ్డి గడివేముల మండలం సహకార సంఘం అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి, తూం బాలేష్ రెడ్డి, బొల్లవరం సుభద్రమ్మ, రామచంద్రారెడ్డి, దుర్వేశ్ కిట్టు యాదవ్ మరియు టిడిపి నాయకులు



## ఎరువులు అధిక ధరలకు విక్రయించిన బ్లాక్ మార్కెట్ కు తరలిస్తే కఠిన చర్యలు.... వ్యవసాయ అధికారి సుమతి.



**రుద్రవరం ప్రతినిధి జూన్ 06 (నంది పత్రిక):**మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న ఎరువులు దుకాణాలలో అధిక ధరలకు వికరించిన బ్లాక్ మార్కెట్ కు తరలించిన అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి సుమతి తెలిపారు. శనివారం ఆమె మండలం లోని ఎరువులు పురుగు మందులు విత్తనాల డీలర్స్ కి మీటింగ్ ఏర్పాటు చేయడమైనది. విత్తనాలు కొనుగోలు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని డీలర్స్ కుడా రైతులకు బిల్లులు ఇవ్వాలని తెలియచేసారు. అలాగే ఈ ఖరీఫ్ సీజన్ లో ఏపీ ఏఐ ఎంఎస్ యాప్ ద్వారానే ఎరువులు పంపిణి చేయాలనీ డీలర్స్ కి తెలియచేసారు. ప్రతి డీలర్ తప్పనిసరిగా బిల్లు బుక్స్ స్టాక్ రిజిస్టర్ ధరల పట్టిక తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. అధిక ధరలకు అమ్మిన బ్లాక్ మార్కెట్ కి తరలించినవారి యొక్క లైసెన్స్ లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎరువులు సరిపడేంత అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని సూచించారు. ఈనెల 8-06-2026 తేదీనుంచి యూరియా మరియు డియేపి డీలర్స్ దగ్గర తమ పొలంలో లో వేసే పంటను అనుగుణంగా ఎరువుల పంపిణి జరుగుతుంది అని తెలిపారు, ప్రతి ఒక్క రైతు తమ ఆధార్ కార్డు ను మరియు రైతు విశిష్ట గుర్తింపు ద్వారా తమకు కేటాయించిన ఎరువులను తీసుకొనుటకు వెసులుబాటు కల్పించారని రైతులు ఇబ్బంది పడకుండా విడతల వారిగా ఎరువులను తీసుకుని తమ పంటలను సాగుచేసుకోవటానికి వ్యవసాయ శాఖ రూపొందించన ఏపీఎంఐపీ యాప్ రైతులకు సులభతరంగా ఎరువులను పంపిణికి సిద్ధం చేసారు.ఈ కార్యక్రమం లో విస్తరణ అధికారి రాజు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వాసవి పాల్గొన్నారు.

# నల్లమల అటవీ ప్రాంతం తనిఖీ



**రుద్రవరం ప్రతినిధి జూన్ 06 (నంది పత్రిక):** నంద్యాల ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ చైతన్య కుమార్ రెడ్డి ఐఎఫ్ఎస్, నల్లమల అటవీ ప్రాంతంలో భాగంగా అహోబిలం సెక్షన్లోని ఈఎంసి చెక్ పోస్ట్ మరియు ఎగువ అహోబిలం పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు విజ్ఞప్తి చేస్తూ, అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ మరియు మద్యం సీసాలను పూర్తిగా నిషేధించాలని, వన్యప్రాణుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం రుద్రవరం రేంజ్ పరిధిలోని ఫాల్కన్ బేస్ క్యాంప్ మరియు గండ్లేరు రిజర్వాయర్ ప్రాంతాలను పరిశీలించిన ఆయన, రుద్రవరం రేంజ్ కార్యాలయంలో నర్సరీ మొక్కలను తనిఖీ చేసి, కాంపా ప్లాంటేషన్ పనులకు సిద్ధం కావాలని సిబ్బందిని ఆదేశించారు. అటవీ విస్తీర్ణాన్ని పెంచే లక్ష్యంతో చేపట్టిన విత్తన బంతుల తయారీ ప్రక్రియను కూడా పర్యవేక్షించి, అటవీ సంరక్షణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రుద్రవరం రేంజర్ ఎస్. ముర్తుజా వలి, డిప్యూటీ రేంజర్ ఎన్. శ్రీనివాసరెడ్డి, ఎఫ్.ఎస్.ఓలు పి. మాబు ఖాన్, ఆర్.ఇ. రాణమ్మ, టి. రామకృష్ణ, జి. శ్రీనివాసులు మరియు ఎఫ్.బి.ఓలు సురేంద్ర గౌడ్, నాగ హుస్సేనయ్య, నరసింహారెడ్డి, జేమ్స్ పాల్ పాల్గొన్నారు.

## ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

### ప్రజలకు మరింత చేరువగా పాలన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్



**ధర్మవరం,బ్యూరో చీఫ్ జూన్ 6:నంది పత్రిక** ధర్మవరం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీర్స్ ) కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్, పాల్గొననున్నారని మంత్రి కార్యాలయం వెల్లడించింది. ప్రజలకు సంబంధించిన సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీర్స్ ) కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపింది. ప్రజలకు ఎదురవుతున్న వివిధ సమస్యలు, అభ్యర్థనలు, వినతులను స్వయంగా స్వీకరించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కార దిశగా చర్యలు తీసుకునే ప్రక్రియలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతోందని పేర్కొంది. ధర్మవరం నియోజకవర్గ ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతులు లేదా ఇతర సమస్యలకు సంబంధించిన వినతులు, ఫిర్యాదులతో కార్యక్రమానికి హాజరుకావచ్చని తెలిపింది. ప్రజల సమస్యల పరిష్కారంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా చర్యలు కొనసాగిస్తున్నారని వివరించింది. ఈ సందర్భంగా ప్రజలు అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను నేరుగా మంత్రి దృష్టికి తీసుకురావాలని మంత్రి కార్యాలయం కోరింది.

## సిరివెళ్ల మండలం చెన్నూరు గ్రామంలో జరిగిన పల్లెకు పోదాం కార్యక్రమం.




**సిరివెళ్ల (నంది పత్రిక)** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నగారి ఆదేశాల మేరకు, జాతీయ నాయకులు ఎతీ మున్నంగి నాగరాజు అన్న గారు విద్యార్థుల కోసం సూచించిన సూచనల మేరకు, సిరివెళ్ల మండల ఇంచార్జ్ హుస్సేన్ మాదిగ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు మేకల దస్తగిరి మాదిగ మరియు చెన్నూరు గ్రామ అధ్యక్షుడు గంగాధరి భాస్కర్ మాదిగ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం చెన్నూరు గ్రామంలో శనివారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 32 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నగారు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, మన జాతి ముద్దుబిడ్డలు అసువులు బాసి సాధించిపెట్టిన ఎస్సీ కులాల వర్గీకరణ ఫలితాలు ఈరోజు మనం అనుభవించే రోజులు వచ్చేసాయి. మన పిల్లలు మన విద్యార్థులు ఎవరైనా మధ్యలో చదువు ఆపేసిన వారు తిరిగి బాగా చదువుకొని చదువు అయిపోయిన తర్వాత తగిన శిక్షణ తీసుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలి అని మరియు మన యువకులు వ్యాపార రంగాలలో ఉపాధి పొందాలని సూచించారు. ఈ ఫలితాల కారణంగా మన జాతి చైతన్యవంతం అవుతుందని రాజకీయ ఎదుగుదలలో తోడ్పడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిరివెళ్ల మండల మీరా జిల్లాఉపాధ్యక్షులు మేకల దస్తగిరి మాదిగ సిరివెళ్ల మండలఇంచార్జ్ హుసేని మాదిగ చెన్నూరు గ్రామ నాయకుడు గంగాధరి భాస్కర్ ముఖ్యఅతిథిగా కార్యవర్గ సభ్యులు పిల్లలు విద్యార్థులు పెద్దలు పాల్గొనడం జరిగింది.

## ఈవీఎంల గోదామును తనిఖీచేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.



**మహబూబాబాద్, జూన్ 06(నంది పత్రిక):**మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కురవి రోడ్ కలెక్టరేట్ దగ్గరలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎంలు), వివిప్యాట్‌లు భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. గోదాములో పటిష్ఠ భద్రత నడుమ భద్రపరిచిన ఈవీఎంలు, వివిప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రి నిల్వ ఉంచిన గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, గోదాం భద్రతా వ్యవస్థలను సమీక్షించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించి, నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పవన్ కుమార్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కొరియాలో ఉద్యోగం అంత కష్టమా?

దక్షిణ కొరియాలో ఉద్యోగం చేయాలనుకుంటున్న భారతీయులను హెచ్చరిస్తూ ఓ యువతి పోస్ట్ చేసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. అక్కడి కార్పొరేట్ ప్రపంచంలో ఎదురయ్యే కఠినమైన సవాళ్లను వివరిస్తూ, ఉద్యోగం కోసం కొరియాకు రావద్దని ఆమె సూచించింది. స్వర్ణిమ్ సింగ్ అనే ఈ యువతి, తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ వీడియోను పంచుకుంది. కొరియాలోని కంపెనీలలో పని గంటలు ముగిసినా, ఆలస్యంగా ఇంటికి వెళ్లాలనే నిబంధన ఉంటుందని స్వర్ణిమ్ తెలిపింది. అలా ఎక్కువ సేపు పనిచేయడమే నిబద్ధతకు చిహ్నంగా భావిస్తారని ఆమె వివరించింది. దీనికి తోడు, పై అధికారుల పట్ల నడుచుకోవాల్సిన తీరు, తప్పనిసరిగా హాజరుకావాల్సిన టీమ్ డిన్నర్లు వంటి అనేక ఒత్తిళ్లు ఉంటాయని పేర్కొంది. ఇలాంటి పార్టీలకు హాజరుకాకపోతే, వారిని సమస్యాత్మక వ్యక్తులుగా చూస్తారని ఆమె వెల్లడించింది. “మీరు భారతీయులై ఉండి, కొరియాకు రావాలని అనుకుంటే, నేను చెప్పేది ఒక్కటే.. రావద్దు“ అని ఆమె తన వీడియోలో స్పష్టంగా చెప్పింది. ప్రస్తుతం పోటీ పెరిగిపోవడం, ఉద్యోగావకాశాలు తగ్గడం, స్వల్పకాలిక కాంట్రాక్టులపై పనిచేసే విదేశీయులకు ఉద్యోగ సంతృప్తి లేకపోవడం వంటి కారణాలను ఆమె ప్రస్తావించింది. కొరియన్ డ్రామాలలో చూపించే ఆదర్శవంతమైన జీవితానికి, క్షేత్రస్థాయిలోని వాస్తవాలకు చాలా తేడా ఉంటుందని ఆమె హెచ్చరించింది.

## అంగన్వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి.

### సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత.



**కేసముద్రం, జూన్ 06(నంది పత్రిక):**రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రాలలో పని చేస్తున్న టీచర్లు, సహాయకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం కేసముద్రం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రాకేష్ కు సిఐటియు అనుబంధ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ గత 50 సంవత్సరాల నుండి పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని, వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికులు ఉన్నారని, నేటికీ వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన అంగన్వాడీల జీవితాల్లో ఎలాంటి మార్పులు లేవని, చాలీచాలని వేతనాలు చెల్లిస్తూ శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ కు నెలకు రూ.18 వేల రూపాయల వేతనం చెల్లిస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా, నేటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. గతం, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసిన ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ కేంద్రాలను తక్షణమే రద్దు చేయాలనీ, ఈ కేంద్రాలను అంగన్వాడీలకు అప్పగిస్తూ వెంటనే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, జీవో నెంబర్ 14 సవరించి అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ కు ఉద్యోగ భద్రత కల్పించాలనీ, అత్యున్నత న్యాయస్థానం చెప్పిన విధంగా అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ కు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ప్రతి నెల ఒకటవ తేదీన వేతనాలు చెల్లించి, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల ప్రకారం బిఎల్ఓ డ్యూటీలు రద్దు చేసి ఐసిడిఎస్ కు సంబంధం లేని అదనపు పనులు చేయించకూడదన్నారు. పెండింగ్ లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని, 24 రోజుల సమ్మె ఒప్పందం ప్రకారం ఈ మధ్యకాలంలో చనిపోయిన అంగన్వాడి టీచర్స్, హెల్పర్ల కు రెండు లక్షల ప్రమాద భీమా డబ్బులు చెల్లించాలని, రాష్ట్రంలో అంగన్వాడి కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు అన్నిటిని ఒకేసారి భర్తీ చేయాలని, 2017 నుండి టీఏ, డీఏలు ఇంక్రిమెంట్ ఇన్చార్జి అలవెన్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని, మంత్రి హామీ ప్రకారం కారుణ్య నియామకాలు త్వరగా చేపట్టాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే సలీమా, కొమ్ము రజిని తదితరులు పాల్గొన్నారు.

## రూ.27 వేల 400 ఆర్థిక సహాయం అందజేసిన టాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్.



**కేసముద్రం, జూన్ 06(నంది పత్రిక):**ఇటీవల ప్రమాదానికి గురై హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేసముద్రం మున్సిపాలిటీకి చెందిన బోడ రమేష్ కు శనివారం కేసముద్రం మండల టాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలుముల మహేష్ ఆధ్వర్యంలో పరామర్శించి రూ.27 వేల 4 వందల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. యూనియన్ సభ్యులందరికీ అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటూ మనోధైర్యాన్నిచ్చారు. పెద్ద మనుసుతో ఆర్థిక సహాయం చేసిన యూనియన్ సభ్యులందరికీ బోడ రమేష్ కుటుంబ సభ్యులు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చిలుముల మహేష్, ఉపాధ్యక్షులు పింగిలి సంతోష్, ప్రధాన కార్యదర్శి నాగుల్ మీరా, సహాయ కోశాధికారి నాగెల్లి సురేందర్, కార్యవర్గ సభ్యులు గొట్టం లక్ష్మీనారాయణ, నాగుల్ పాషా పాల్గొన్నారు.

## మున్సిపల్ వార్డుల్లో సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి.

### వార్డు సభలో మున్సిపల్ చైర్ పర్సన్ సునీతవెంకన్న.




**కేసముద్రం, జూన్ 06(నంది పత్రిక):**ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం కేసముద్రం మున్సిపల్ పరిధిలో వార్డుల సభ నిర్వహించారు. ఈ వార్డుల సభలకు కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్ పర్సన్ అల్లం రమ నాగేశ్వర్ రావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పంట మార్పిడి చేద్దాం-భూసారాన్ని కాపాడుదామని రైతు సోదరులకు సూచించారు. మహిళల భద్రత, కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. వార్డులో డ్రైనేజ్, సానిటేషన్, సైడ్ డ్రెయిన్ ల పూడికతీత సమస్యలు ఉంటే వెంటనే అధికారులకు వార్డు కౌన్సిలర్లు చెప్పి చేయించుకోవాలన్నారు. రాబోయే వర్షాకాలంలో నీటి నిలువ లేకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. వార్డ్ లో లైట్, రోడ్, సమస్యలు ఉంటే సంబంధించిన అధికారులకు లేదా కౌన్సిలర్ల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మున్సిపాలిటీ ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటామని ప్రజలకు ధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.శ్రీనివాస్ రావు, వార్డ్ కౌన్సిలర్లు తరాల వీరేష్, కిషోర్, భారతి, సుభద్ర, విజయ, ఉమ, వినయ్, రాము, కృష్ణ, సునీత, శారద, విద్యా, వ్యవసాయ, వైద్య, పోలీస్, పట్టణాభివృద్ధి, రెవిన్యూ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడీ టీచర్, ఆశ వర్కర్స్, మున్సిపాలిటీ ఆర్పీలు, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బేతంచెర్ల హనుమాన్ నగర్ లో “ ఆపరేషన్ క్లీన్ స్వీప్“ కార్యక్రమం.



**బేతంచెర్ల జూన్ 6 ( నందిపత్రిక ).** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, డోన్ నియోజక వర్గ శాసన సభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి సూచనల మేరకు, బేతంచెర్ల నగర పంచాయితీ కమీషనర్ డి. హరిప్రసాద్ ఆధ్వర్యంలో బేతంచెర్లపట్టణంలో “ఆపరేషన్ క్లీన్ స్వీప్“ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నాలుగు వారాల ప్రత్యేక పణాళికలో భాగంగా, మూడవ వారంలో “వ్యర్థాల వర్గీకరణ మరియు మార్కెట్లు,వాణిజ్య, ప్రాంతాల పరిశుభ్రత“పై స్థానిక హనుమాన్ నగర్ నందు ఒక ప్రత్యేక అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ డి.హరి ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతిరోజూ వ్యర్థాలను తమ వద్ద చేరే చెత్తను తడి,పొడి వ్యర్థాలుగా తప్పని సరిగా వేరు చేయాలని, తడి చెత్తను నగర పంచాయతి వాహనాలకు ఇవ్వకుండా, తమ సొంత ప్రాంగణాల్లోనే, శాస్త్రీయంగా ప్రాసెస్ చేసుకునేలా, సొంత మెకానిజం ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న సింగిల్ యూజ్ (ఏకకాల వినియోగ) ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, నిబంధనల ప్రకారం వేరు చేసిన పొడి చెత్తను మాత్రమే ఇకపై నగర పంచాయితీ వాహనాలు సేకరిస్తాయని ఆయన స్పష్టం చేశారు. పట్టణ పరిధిలోని అన్ని ప్రభుత్వ,ప్రైవేటు హాస్టళ్లు,ఫంక్షన్ హాళ్లు,కళ్యాణ మండపాలు, హోటళు ,,రెస్టారెంట్లు మరియు అపార్ట్‌మెంట్ల నిర్వాహకులు ఈ బాధ్యతను స్వీకరించి, ప్లాస్టిక్ రహిత పొడి వ్యర్థాలను మాత్రమే నగర పాలక సిబ్బందికి అందించాలని,తడి చెత్తను వివిధ కంపోస్ట్ పద్ధతుల ద్వారా ప్రాసెస్ చేసుకోవాలని తెలియ జేశారు. రాష్ట్ర ప్రభుత్వం ‘స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‘ సాధన కోసం శత విధాలా కృషి చేస్తోందని, అందులో భాగంగానే బేతంచర్ల నగర పంచాయతీని,పరిశుభ్ర నగరంగా మార్చేందుకు,బేతంచెర్ల పట్టణ పౌరులంతయూ బాధ్యతగా, చెత్త వర్గీకరణపై పూర్తి అవగాహన కలిగి ఉండి,నగర పంచాయితికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్,మేస్త్రీలు,పారిశుద్ధ్య కార్మికులు మరియు ప్రజలు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి.. ఎంపీడీవో



**చాగలమర్రి నంది పత్రిక జూన్ 6** యోగేంద్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా, ప్రణాళిక బద్ధంగా సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేద్దామని ఎంపీడీవో, ప్రత్యేక అధికారి తాహిర్ హుస్సేన్ మండల కార్యదర్శులను, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, శారీరక మానసిక శ్రేయస్సుకోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగ వ్యాసానికి ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. యోగ పట్ల అవగాహన పెంపొందించి ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చే లక్ష్యంతో జూన్ 7 నుంచి 21 వరకు యోగ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశం నందు అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా అభ్యాసకుల పేర్లు నమోదుపై ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది కి తగు సూచనలు ఇచ్చారు. 3875 నిరక్షరాశులను గుర్తించి వారి పేర్లు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. యోగ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 17 సచివాలయాలకు 11675 మంది శిక్షకులకు గాను 289 ట్రైనర్స్ తో ఈనెల 21 వరకు యోగాంధ్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య సూపర్వైజర్ మాధవ్, ఏవో రాజేంద్రప్రసాద్, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు డిప్యూటీ ఎంపీడీవో తారకేశ్వరి, వెలుగు ఏపీఎం నాగమ్మ, రాజకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



## 8న నంద్యాలలో జిల్లా మంత్రులతో సమీక్షా సమావేశం

**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 6:** నంద్యాల జిల్లాలో ఈనెల 8న ఉదయం 10 గంటలకు ఇన్చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ అధ్యక్షతన జిల్లా సమీక్ష సమావేశం జరుగునున్నది. ఈ విషయాన్ని శ్రీశైలం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయం శనివారం రాత్రి పేర్కొంది. ఇంచార్జి మంత్రి పయ్యావుల కేశవ్ తో పాటు, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు, నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇన్చార్జి, జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యులతో పాటు ముఖ్య నాయకులంతా తప్పకుండా హాజరుకావాలని తెలుగుదేశం పార్టీ కార్యాలయం పేర్కొంది.

## అమెరికాలో తెలంగాణ యువకుడి కాల్చివేత

ఉపాధి నిమిత్తం అమెరికా వెళ్లిన తెలంగాణకు చెందిన ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. నార్త్ ఫిలడెల్ఫియాలో పిజ్జా డెలివరీ చేస్తుండగా గుర్తుతెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో అతడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గుండ్లపోచంపల్లికి చెందిన కుంచ అన్షుల్‌గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే, అన్షుల్ అమెరికాలో పిజ్జా డెలివరీ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే విధుల్లో భాగంగా పిజ్జా డెలివరీ చేసేందుకు వెళ్లగా, దుండగులు అతడిపై కాల్పులు జరిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అన్షుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. అన్షుల్ మరణవార్త విన్న అతడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# "రైజింగ్ రాయలసీమ"తో అభివృద్ధికి కొత్త దిశ..!!






**రాష్ట్ర మంత్రులు వై. సత్యకుమార్, టి.జి. భరత్ వెల్లడి**

**రాబోయే 20 ఏళ్లలో కడప దేశానికే అభివృద్ధి కేంద్రంగా రాయలసీమ : జిల్లా కలెక్టర్**

**పెట్టుబడులు, పరిశ్రమలే రాయలసీమ భవిష్యత్తుకు బలమైన పునాది**

**రాయలసీమ అభ్యున్నతి కోసం "రైజింగ్ రాయలసీమ" సదస్సు**

**పారిశ్రామిక వికాసం, పెట్టుబడులు, నవకల్పనలపై మేధోమథనం**

**వైఎస్సార్ కడప, బ్యూరో చీఫ్ జూన్ 6నంది పత్రిక :** రాయలసీమను కరువు, వలసల ప్రాంతంగా కాకుండా పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్యకుమార్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్ స్పష్టం చేశారు. శనివారం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో.. రాయలసీమ ప్రాంత అభ్యున్నతి, పారిశ్రామిక వికాసం, పెట్టుబడుల ప్రోత్సాహం, నవకల్పనలపై చర్చించేందుకు సమర్థ్ రీసెర్చ్ అండ్ రిసర్జెన్స్ ఆధ్వర్యంలో "రైజింగ్ రాయలసీమ – ఇండస్ట్రీ, ఇన్నోవేషన్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్" సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్యకుమార్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి లతో పాటు ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.అలాగే.. ల్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బి. జయరామిరెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, సమర్థ్ కన్వీనర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాయలసీమలో అపారమైన సహజ, మానవ వనరులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ సమగ్రాభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

**మేధావులు, పరిశోధకుల భాగస్వామ్యం**సదస్సులో రాయలసీమ అభివృద్ధిపై సమగ్ర చర్చఈ సందర్భంగా రాయలసీమలో పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల విస్తరణ, సహజ వనరుల సద్వినియోగం, పెట్టుబడుల ఆకర్షణ, విద్యాపరిశోధన రంగాల అభివృద్ధి, యువతలో నవకల్పనలను ప్రోత్సహించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రాంతీయ అభివృద్ధికి ప్రభుత్వ విధానాలు, భవిష్యత్ అవకాశాలపై నిపుణులు తమ అభిప్రాయాలు వెల్లడించారు అలాగే వివిధ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, పరిశోధకులు, రీసెర్చ్ స్కాలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, మేధావులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై రాయలసీమ భవిష్యత్ అభివృద్ధిపై తమ సూచనలు, అభిప్రాయాలు వెల్లడించారు. మూడు సెషన్లలో సాగిన ఈ సదస్సుల్లో రాయలసీమ అభివృద్ధిపై విస్తృత చర్చలు జరిగాయి. రాయలసీమ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిపాలనా అధికారులు తమ అభిప్రాయాలు వెల్లడించారు.

**వనరులు, అవకాశాలు, సవాళ్లపై తొలి సదస్సు** డాక్టర్ ఎస్. సిద్ది రాజు అధ్యక్షతన జరిగిన తొలి శాస్త్రీయ సదస్సులో రాయలసీమలో పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన వనరులు, అవకాశాలు, సవాళ్లపై చర్చించారు. డాక్టర్ వై. కేశవ రెడ్డి ప్రాంతంలోని సహజ వనరులు, పారిశ్రామిక అవకాశాలు, పెట్టుబడులకు అనుకూల పరిస్థితులను వివరించారు. డాక్టర్ బులుసు శ్రీనివాస్ గనులు, ఖనిజ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి, విధానపరమైన అంశాలపై విశ్లేషణాత్మకంగా వివరించారు.



ఎంఎస్ఎంఈలు, క్లస్టర్ అభివృద్ధిపై రెండో సదస్సు

వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ బి. జయరామి రెడ్డి అధ్యక్షతన జరిగిన రెండో సదస్సులో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి, క్లస్టర్ విధానాలపై చర్చ జరిగింది. ముజీబుద్దీన్ ఔషధ, రసాయన పరిశ్రమల విస్తరణ అవకాశాలు, ఎదురవుతున్న సవాళ్లను వివరించారు. డాక్టర్ ఎస్. లింగమూర్తి ఎంఎస్ఎంఈల బలోపేతం, పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాల పెరుగుదలపై మాట్లాడారు.పర్యావరణంపునరుత్పాదక ఇంధనంపై మూడో సదస్సు ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన మూడో శాస్త్రీయ సదస్సులో పర్యావరణ పరిరక్షణ, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంపై చర్చ జరిగింది. సి. అచలేందర్ రెడ్డి అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ పరస్పర పూరకాలని, రెండింటి మధ్య సమతుల్యత అవసరమని వివరించారు. ఎం. శ్రీహరి పారిశ్రామిక అభివృద్ధికి భూగర్భ జలాల సక్రమ వినియోగం, నీటి సంరక్షణ అత్యంత కీలకమని సూచించారు.

**నిపుణుల సూచనలకు ప్రాధాన్యం** రాయలసీమ పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పర్యావరణ పరిరక్షణ, వనరుల సద్వినియోగం వంటి అంశాలపై నిపుణులు చేసిన సూచనలు ప్రాంత భవిష్యత్ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తాయని సదస్సు నిర్వాహకులు పేర్కొన్నారు.





# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలి

**అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం**

**నిర్లక్ష్యం, తప్పుడు నమోదులపై కఠిన చర్యలు తప్పవు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





**నంద్యాలబ్యూరో చీఫ్ , జూన్ 6 నంది పత్రిక** జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులను (బీఎల్ఓలు) ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో ఆళ్లగడ్డ నియోజకవర్గానికి చెందిన బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఈఆర్వోలు, ఏఈఆర్వోల కోసం నిర్వహించిన "ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం" శిక్షణలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ఓటర్ల నమోదు ప్రక్రియ, ఎన్యూమరేషన్ ఫారాల భర్తీ, క్షేత్రస్థాయి ధృవీకరణ విధానాలపై బీఎల్ఓలకు సమగ్రంగా, పూర్తిస్థాయిలో శిక్షణ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లు జాబితాలో చేరకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

**ఎన్యుమరేషన్ ఫారమ్‌ల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేదు** ఎన్యుమరేషన్ ఫారమ్‌లు ముందస్తుగా ముద్రించబడి ఉంటాయని, ఖాళీగా ఉన్న వివరాలను మాత్రమే పూరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఫారమ్‌పై సంబంధిత ఓటరు లేదా ఇంటి పెద్దల సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని, అనంతరం వాటిని డిజిటలైజ్ చేసి డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో నమోదు చేయాలని పేర్కొన్నారు.

**ఫారమ్ తిరిగి రాకపోతే కారణాలు స్పష్టంగా నమోదు చేయాలి** ఎన్యుమరేషన్ ఫారమ్‌లు తిరిగి రాని సందర్భాల్లో కేవలం నాలుగు కారణాలైన ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ అనే వివరాలను మాత్రమే నమోదు చేయాలని సూచించారు. ఈ వివరాల ఆధారంగా బూత్ వారీగా ప్రత్యేక జాబితాలు తయారు చేసి ప్రజల అభ్యంతరాల కోసం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**బీఎల్ఏలు సమర్పించే ఫారమ్‌లపై ప్రత్యేక పరిశీలన** బూత్ లెవల్ ఏజెంట్లు ( బి ఎల్ ఏ లు) రోజుకు గరిష్టంగా 50 ఎన్యుమరేషన్ ఫారమ్‌లు మాత్రమే సమర్పించగలరని తెలిపారు. వారు అందించే ప్రతి ఫారమ్‌ను క్షుణ్ణంగా పరిశీలించి సంతకాల ప్రామాణికతను నిర్ధారించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని పేర్కొన్నారు.

**డ్రాఫ్ట్ నుంచి ఫైనల్ రోల్ వరకు కార్యాచరణ షెడ్యూల్ ఖరారు** జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తారని తెలిపారు. జూలై 21న డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, అనంతరం క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన పూర్తి చేసి సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

**మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి** జిల్లాలో మొత్తం 14 లక్షల మంది ఓటర్లలో ఇప్పటికే 10 లక్షల మందికి పైగా మ్యాపింగ్ పూర్తైందని, మిగిలిన వారందరి మ్యాపింగ్‌ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మ్యాపింగ్ సక్రమంగా జరగకపోతే ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో కనిపించకపోవడంతో అనవసర సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.

**అవసరమైన సందర్భాల్లోనే డిక్లరేషన్ ఫారమ్‌ల వినియోగం** ఇప్పటి వరకు మ్యాపింగ్ కాని అర్హుల కోసం మాత్రమే అనెక్సర్-4 డిక్లరేషన్ ఫారమ్‌ను వినియోగించాలని సూచించారు. వయస్సు, జనన తేదీ ఆధారంగా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పరిశీలించాలని తెలిపారు.

**ఆధార్ గుర్తింపు పత్రం మాత్రమే** ఆధార్ కార్డు కేవలం గుర్తింపు పత్రంగా మాత్రమే పరిగణించబడుతుందని, అది జనన తేదీ లేదా నివాసానికి పూర్తి ఆధార పత్రం కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం సూచించిన ఇతర చెల్లుబాటు అయ్యే పత్రాలను కూడా అవసరానికి అనుగుణంగా పరిశీలించాలని సూచించారు.

**రికార్డుల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకత పాటించాలి** ఎవరికి ఫారమ్‌లు పంపిణీ చేశామనే వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఫారమ్‌లు తిరిగి రాని ఓటర్ల జాబితాలను పంచాయతీ, మున్సిపల్, తహసీల్దార్, ఈఆర్ఓ మరియు కలెక్టర్ కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**రాజకీయ ఒత్తిళ్లకు లొంగవద్దు** ఎన్నికల ప్రక్రియలో రాజకీయ ఒత్తిళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ లొంగవద్దని సిబ్బందికి సూచించారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే ఏఈఆర్ఓ లేదా జిల్లా అధికారులకు సమాచారం అందించాలని, ఫీల్డ్ స్థాయిలో సిబ్బందికి పూర్తి రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

**తప్పుడు నమోదులు, నిర్లక్ష్యంపై కఠిన చర్యలు** ఓటర్ల నమోదు ప్రక్రియలో తప్పుడు వివరాలు నమోదు చేసినా, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించినా చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం -1950లోని సెక్షన్ 31, 32 ప్రకారం జైలు శిక్షలు, జరిమానాలు విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.




**జూన్ 14 నాటికి వంద శాతం లక్ష్యం సాధించాలి** ప్రత్యేక సర్వే, మ్యాపింగ్, ఫారమ్‌ల డిజిటలైజేషన్ తదితర పనులను జూన్ 14లోపు వంద శాతం పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం భారత ఎన్నికల సంఘం సరఫరా చేసిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్ ) కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు)కు గొడుగు, క్యాప్ తదితర వస్తువులతో కూడిన ప్రత్యేక కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వేలు, ఎన్నికల విధుల నిర్వహణ సమయంలో ఎండ, వర్షాల నుంచి రక్షణ కల్పించడంతో పాటు విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కిట్లు ఉపయోగపడతాయని ఆమె తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిఆర్ఓ రామునాయక్, నంద్యాల ఆర్డీఓ మరియు ఈఆర్ఓ విశ్వనాధ్, ఆరు మండలాల తాసిల్దారులు, అన్ని పోలింగ్ స్టేషన్ల బిఎల్ఓలు, పాల్గొన్నారు.



# కేసముద్రం మున్సిపల్ వార్డ్ లలో కార్డన్ అండ్ సెర్చ్.



**ఎస్పి శబరీష్ ఆదేశాలు, డిఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసుల సోదాలు.**

**గంజాయి వినియోగం, గుడుంబా రవాణాపై ప్రత్యేక నిఘా.**

**అక్రమార్జన కోసం ప్రజల ప్రాణాలతో చెలగటమాడవద్దు.**

**కేసముద్రం సిఐ సత్యనారాయణ.**

**కేసముద్రం, జూన్ 06(నంది పత్రిక):**కేసముద్రం సర్కిల్ పరిధిలో గంజాయి, గుడుంబా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాటుపడితే కఠిన చర్యలు తప్పవనీ, అక్రమార్జన కొరకు ఇతరులు ప్రాణాలను పణంగా పెడితే చూస్తూ ఊరుకునేది లేదని కేసముద్రం సర్కిల్ ఇన్స్పెక్టర్ వై.సత్యనారాయణ గంజాయి వినియోగం, అక్రమ రవాణా, గుడుంబా తయారీ, రవాణా దారులను హెచ్చరించారు. మహబూబాబాద్ ను గంజాయి, గుడుంబా రహిత జిల్లాగా మార్పులో భాగంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పి శబరీష్ ఐపిఎస్ ఉత్తర్వులు, మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు ఆధ్వర్యంలో కేసముద్రం సీఐ సత్యనారాయణ, సర్కిల్ ఎస్ఐలు క్రాంతి కిరణ్, కరుణాకర్, నరేష్, సర్కిల్ సిబ్బందితో కేసముద్రం మున్సిపల్ పరిధిలోని 15, 16 వ వార్డ్ లలో శనివారం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ముఖ్యంగా గంజాయి త్రాగేవాళ్ళని, రవాణా చేసేవాళ్ళని, గుడుంబా తయారు చేసేవాళ్ళని, నల్ల బెల్లం అమ్మేవాళ్ళని టార్గెట్ చేసుకొని సెర్చ్ నిర్వహించినట్లు సిఐ తెలిపారు. ఈ సెర్చ్ లో 200 లీటర్ల గుడుంబా, 2 క్వింటాల నల్లబెల్లం, 24 లీటర్ల ఐఎంఎఫ్ఎల్, 4 వేల లీటర్ల బెల్లం పానకం సీజ్ చేసి, వాటిని తయారు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయికి సంబంధించిన సమాచారం 8712656999 నెంబర్ కి ఫోన్ చేసి తెలిపితే రూ.5 వేల రూపాయలు బహుమతి ఇవ్వబడునని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుననీ తెలిపారు.



# ఎమ్మెల్యే సహకారంతో భువనగిరి పట్టణం అభివృద్ధి





### మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి
### ఘనంగా ప్రజాపాలన ప్రగతి పదం కార్యక్రమం ముగింపు
### పారిశుధ్యం పై ప్రజలకు అవగాహన
### వర్షాల సంసిద్ధత ముందస్తు ప్రణాళిక

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో భువనగిరి పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ తెలిపారు. ప్రజా పాలనతో ప్రగతి పథంలో భువనగిరి( వార్డుల) ముగింపు సభలలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శనివారం భువనగిరి పట్టణంలోని 14, 15, 17, 18, 19, 21, 25, 28, 30, 32 వార్డుల్లో నిర్వహించబడు తున్న వార్డు సభలలో భాగంగా వార్డు నం.15, 28, 30, 32లలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ తో పాటు,మున్సిపల్ కమిషనర్ కే. చంద్ర ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో, స్థానిక వార్డు సభ్యులు నాజియ రహమాన్ జహంగీర్, సుదగాని సరిత రాజు, శ్రీ యం.డి. లయీఖ్ అహ్మద్, బర్రె సంఘవి కరుణాకర్ అధ్యక్షతన సభలు నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ చైర్మన్ శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో ముందుభాగం లో

ఉన్నామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ముగింపు సభల ద్వారా పట్టణ ప్రజలకు సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ రూల్స్-2026, జల్ సంచయ్-జల్ భగీరత పథకం క్రింద ఇంకుడు గుంతల నిర్మాణం, మురికి కాలువల శుభ్రం, పూడికతీత పనులు, వర్షాకాల సంసిద్ధత కార్యాచరణ ప్రణాళిక, మంచినీటి సరఫరా-నిర్వహణ, నీరు నిలిచే ప్రాంతాల నివారణ, పారిశుద్ధ్యం, రోడ్ల నిర్వహణ, వీధి దీపాలు, మొక్కలు-పర్యావరణ సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు, స్థానిక నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, వార్డు ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గాలివారిగూడెంలో ఘనంగా ‘ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక‘ గ్రామ సభ.





### సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధే ధ్యేయం: సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్.
### సీజనల్ వ్యాధులు, పోషకాహారంపై అధికారుల అవగాహన.

మరిపెడ మండలం గాలివారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం ‘ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక‘ లో భాగంగా గ్రామ సభను అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు గ్రామ ప్రజలు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామంలోని ప్రతి సమస్యను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రజలందరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

**ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత:** డాక్టర్ గుగులోతు రవిగ్రామ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి విషయంలో జాగ్రత్తలు వహించాలని అవగాహన కల్పించారు.

**పోషకా హారంతోనే సంపూర్ణ ఆరోగ్యం:** ఐసీడీఎస్ సూపర్వైజర్ ఉష మాట్లాడుతూ.. మహిళలు, గర్భిణులు, బాలింతలు చిన్న పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించడానికి పౌష్టికాహారం (న్యూట్రిషన్) ఎంతో అవసరమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను, పోషక విలువలు గల ఆహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**అభివృద్ధి పనుల వివరణ:** ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఈ గ్రామంలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పన, వివిధ అభివృద్ధి పనుల పురోగతిని ప్రజలకు వివరించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన అవగాహన కల్పించారు. ఈ గ్రామ సభలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు , మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

### ఇనస్పెక్టర్ లు ప్రవీణ్ బాబు తేజం రెడ్డి
### ప్రజా ప్రభుత్వం ప్రగతి ప్రణాళికలో భాగంగా అరోరా కాలేజీలో అవగాహన కార్యక్రమం
### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
### మారకద్రవ్యాల వినియోగం వల్ల అనేక శారీరిక రుగ్మతలు



విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా బాధ్యతయుతమైన ఎదగగలరని భువనగిరి పట్టణ పోలీస్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ బాబు, తేజం రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వం ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్ష్ యాదవ్ ఆదేశాల మేరకు శనివారం భువనగిరిలోని అరోరా కాలేజీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ బాబు, ఇన్‌స్పెక్టర్ తేజం రెడ్డి, కానిస్టేబుల్ శ్రీహరి, మహిళా కానిస్టేబుల్ మమత పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులకు ప్రస్తుతం సమాజాన్ని ప్రభావితం చేస్తున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం రక్షణ, బలమైన పాస్‌వర్డ్‌ల వినియోగం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే మహిళల భద్రత, షీ టీమ్ సేవలు, మహిళల రక్షణ కోసం అందుబాటులో ఉన్న చట్టపరమైన సదుపాయాలు గురించి వివరించారు. అదేవిధంగా యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావాలు గురించి తెలియజేస్తూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యత గురించి వివరించారు.విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగగలరని, ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు.

# గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి నెహ్రూ నాయక్ రూ.25 వేల విరాళం.

### యాదవుల ఆరాధ్య దైవం ఆలయ అభివృద్ధికి అండగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు.



యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీ గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులకు రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందించి తన సేవాభావాన్ని చాటుకున్నారు. డోర్నకల్ పట్టణంలోని ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధుల సేకరణలో భాగంగా ఈ విరాళాన్ని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్ జైన్ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ తల్లి ఆలయం యాదవ సమాజానికి ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందని, ఆలయ నిర్మాణం పూర్తయితే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సమాజాభివృద్ధి, ధార్మిక కార్యక్రమాలకు తనవంతు సహకారం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.యాదవ సంఘ నాయకులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి చేయూతనందించిన నెహ్రూ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సేవా కార్యక్రమాల్లో ఆయన ఎల్లప్పుడూ ముందుండి సహకరిస్తున్నారని కొనియాడారు.ఆలయ నిర్మాణం త్వరగా పూర్తై భక్తులకు అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమంలో యాదవ సంఘ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. “గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.25 వేల విరాళం అందించిన మాలోత్ నెహ్రూ నాయక్ ఆధ్యాత్మిక, సామాజిక సేవలకు మరోసారి చేయూత“

# లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్‌లో మేకల మారుతి యాదవ్‌కు చోటు

### -క్లబ్ సభ్యులందరి సేవా తపనకు, సమిష్టి కృషికి లభించిన గౌరవం



రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ అధ్యక్షుడు లయన్ మేకల మారుతి యాదవ్ అధ్యక్ష పదవి కాలం ఈ నెల 30న ముగుస్తుంది. అయితే వీరి నాయకత్వంలో క్లబ్ చేస్తున్న సేవలను గుర్తించి లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్‌లో స్థానం దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ జిల్లా క్యాబినెట్‌లో నాకు అవకాశం రావడం వ్యక్తిగత గుర్తింపు మాత్రమే కాదు, లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సభ్యులందరి సేవా తపనకు, సమిష్టి కృషికి లభించిన గౌరవంగా భావిస్తున్నాను. సమాజ సేవే లక్ష్యంగా మరింత అంకితభావంతో పనిచేస్తున్నామని తెలిపారు. లయన్స్ క్లబ్ 320జీ జిల్లా (ఉమ్మడి కరీంనగర్, అదిలాబాద్ జిల్లాలు) పరిధిలోని 94 లయన్స్ క్లబ్‌లకు 2026-27 సంవత్సరానికి జిల్లా గవర్నర్‌గా లయన్ మోర బద్రేశం, మొదటి ఉప గవర్నర్‌గా లయన్ గుటుక చంద్రప్రకాశ్, రెండవ ఉప గవర్నర్‌గా లయన్ ఉదరి చంద్రమోహన్ ఎన్నికయ్యారు. వీరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా క్యాబినెట్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తించి క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి యాదవ్‌ను జిల్లా క్యాబినెట్ కి ఎంపిక చేశారు. జిల్లా క్యాబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 7న కరీంనగర్‌లోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా తనను జిల్లా క్యాబినెట్‌కు ఎంపిక చేసిన జిల్లా గవర్నర్ మోర బద్రేశం, ఉప గవర్నర్లు గుటుక చంద్రప్రకాశ్, ఉదరి చంద్రమోహన్‌లకు, అలాగే సహకరించిన రీజినల్ చైర్మన్ శశాంక్, జోనల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సభ్యులందరికీ మేకల మారుతి యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా క్యాబినెట్‌లో స్థానం దక్కిన మేకల మారుతి యాదవ్‌కు క్లబ్ సభ్యులు, లయన్స్ నాయకులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

# నేత్రదానంతో ఇద్దరికి కంటి చూపు

### -కుటుంబ పెద్దను కోల్పోయిన బాధలోనూ గొప్ప నిర్ణయం



కుటుంబ పెద్దను కోల్పోయిన తీవ్ర విషాదంలోనూ మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉన్నత భావంతో ఒక కుటుంబం నేత్రదానానికి ముందుకు వచ్చి మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది.రామగిరి మండలం చందనాపూర్ కు చెందిన పొన్నం సారయ్య గౌడ్ (55) మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు తమ దుఃఖాన్ని పక్కనబెట్టి నేత్రదానానికి అంగీకరించారు. వారి గొప్ప నిర్ణయంతో సేకరించిన రెండు కార్నియాల ద్వారా ఇద్దరు దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు చూపు ప్రసాదించే అవకాశం లభించింది. ఈ విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ డైరెక్టర్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి వెంటనే స్పందించి సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్‌లను సంప్రదించి నేత్రాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ నేత్రదానానికి అంగీకరించిన సారయ్య గౌడ్ భార్య సరోజన, కుమారులు అభిషేక్, కిషోర్, రాకేష్, కుటుంబ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వారి నిర్ణయం మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజుల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ సాగర్ రావు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొని కుటుంబ సభ్యులను అభినందించారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు, కార్యక్రమాన్ని సమన్వయం చేసిన సదాశయ ఫౌండేషన్ సభ్యులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ అధ్యక్షుడు లయన్ మేకల మారుతి యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగు నింపే మహాదానం నేత్రదానం. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.



# సింగరేణి పరిరక్షణ సదస్సుకు భారీగా తరలిరండి

### -ఏఎల్పి మైన్ వద్ద కార్మికులను చైతన్యపరచిన టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి

సింగరేణి పరిరక్షణ కోసం, కార్మికుల ప్రయోజనాలు, హక్కుల సాధన, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలపై తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో నేడు సాయంత్రం గోదావరిఖనిలో నిర్వహించనున్న భారీ సదస్సుకు సింగరేణి కార్మికుల పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య కోరారు. శనివారం అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ వద్ద కార్మికులను కలుసుకొని తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని సింగరేణి స్థితిగతులను, కంపెనీలో జరుగుతున్న అవకతవకలు, కుంభకోణాలను వివరించి కార్మికులను చైతన్యపరిచే సింగరేణి పరిరక్షణ సదస్సును నిర్వహించనున్నట్లు వివరించారు. ఇటీవల కాలంలో సింగరేణి కంపెనీ మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలను నిర్వహించి సింగరేణి కంపెనీ గడ్డు పరిస్థితిల్లో ఉందని పేర్కొన్న విషయాన్ని కార్మికులకు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ రెండున్నర సంవత్సరాలలోనే సింగరేణిలో అనేక అవకతవకలు పెద్ద ఎత్తున అవినీతికి సంబంధించిన వ్యవహారాలు జరగడంతో కంపెనీ ప్రతిష్ట దిగజారుతున్నదన్నారు.



ఎన్నికలకు ముందు కార్మికులకు అనేక హామీలు ఇచ్చిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలైన ఏఐటియుసి, ఐఎన్టియుసి తమ పదవీకాలం పూర్తవుతున్న ఒక్క హామీని సైతం నెరవేర్చలేక కార్మికులను దగా చేశాయని విమర్శించారు. కెసిఆర్ కారుణ్య నియామకాల పేరుతో 15000 మందికి పైగా తండ్రి ఉద్యోగాలనుకొడుకుల ఇవ్వగా వాటిలో సైతం విజిలెన్స్ కమిషన్ ద్వారా విచారణ చేస్తామని ప్రభుత్వ పెద్దలు పేర్కొనడం అత్యంత దుమార్గమని, ఇది కార్మికులను భయపెట్టడమేనని విమర్శించారు. గైర్హాజరు కార్మికులను పూర్తి ఉద్యోగంలో నుండి తీసివేయడానికి యాజమాన్యం సిద్ధమవుతుందని, కొత్త పద్ధతిని సైతం అమలు చేసేందుకు ముందుకు సాగుతున్నదని ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులంతా సంఘటితంగా చైతన్య వంతం అవడం ద్వారానే మన అస్తిత్వాన్ని కాపాడుకోగలమని వివరించారు. కేవలం సింగరేణి సంస్థలో జరుగుతున్న పరిణామాలు, అవకతవకలు వల్ల కార్మికులకు జరుగుతున్న నష్టం, కంపెనీ భవిష్యత్తు లాంటి అంశాలపై జరిగే అతి ముఖ్యమైన సదస్సుకు పెద్ద సంఖ్యలో కార్మిక సోదరులు విచ్చేసి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ వివి గౌడ్ ,సెంట్రల్ కమిటీ నాయకులు గట్టు శ్రీనివాస్, పాశం శ్రీనివాస్ రెడ్డి, ఓర్ మెన్ తేజ, ఇతర పిట్ కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# మొండికుంట యువకుడికి కవిశ్రీ" బిరుదు వరించింది..



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం అశ్వాపురం మండలం మొండిగుంట గ్రామానికి చెందిన యువకు డు సాహిత్యంలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటూ, ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్యామల లింగారెడ్డిని సాహితీ "కవిశ్రీ " విశిష్ట బిరుదును అందుకోనున్నారు.అశ్వాపురం : మొండికుంట గ్రామానికి చెందిన శ్యామల లింగారెడ్డి హైస్కూల్ చదువుల నుండే కవిత్వశీ పై ప్రతిభ కనబరుస్తూ సాధారణ పదాలకు భిన్నంగా, మనసును రంజింపజేసే మరియు ఆలోచింపజేసే సృజనాత్మక సాహిత్య ప్రక్రియను కవిత్వం రాసే వారు ఆయన . సమాజంలోని మార్పులు, అనుభవాలు, ఆవేదనలు, ఆర్తిని అక్షర రూపంలో వ్యక్తం చేసే కవిత్వం లింగారెడ్డి కలం నుండి జాలువారిన ఆణిముత్యాలు ఎన్నో ఎన్నెన్నో .... ఆయన కవితలు ఎన్నో రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికయ్యాయి ఆయన ప్రతిభకు

నేషనల్ "మహతి సాహితి కవి సంగమం" సంస్థ తెలంగాణ నుండి మొండికుంట గ్రామానికి చెందిన శ్యామల లింగారెడ్డికి " మహతీ కవిశ్రీ " బిరుదుకు ఎంపిక చేసింది.ఈ బిరుదును ఈనెల 21న హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రధానం( అంకితం) చేయనున్నారు."కవిశ్రీ " బిరుదు అవార్డు అందుకోబోతున్న శ్యామల లింగారెడ్డిని అనేకమంది సాహితీవేత్తలు, స్థానికులు అభినందనల వర్షం కురిపిస్తున్నారు.

# హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికలలో విజయం సాధించిన రవిని సన్మానించిన మాజీ ఎంపీపీ



తెలంగాణ రాష్ట్ర హై కోర్టు అడ్వకేట్ అసోసియేషన్ ఎలక్షన్స్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఫలితాల్లో విజయ ఢంకా మోగించిన పొనంపెల్లి రవిని రామగిరి మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ శనివారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. రామగిరి మండలం రామయ్యపల్లి (బుధవారంపేట)కి చెందిన పొనంపెల్లి రవి గ్రామానికి అవసరం అయిన న్యాయ సహాయాన్ని అందించాలని గ్రామ అభివృద్ధి కృషి చేయాలని కోరారు.

# ఘనంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు





:-యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని బీర్ల నిలయం వద్ద ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఉదయం నుంచే అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో హాజరై జన్మదిన వేడుకలను ఉత్సాహభరితంగా జరిపారు.జన్మదిన సందర్భంగా బీర్ల అయిలయ్య ఉదయం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు అందుకున్నారు.తర్వాత యాదగిరిగుట్ట పట్టణంలోని బీర్ల నిలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో భాగంగా, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు బీర్ల అయిలయ్యకి ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులకు నిత్యావసర ఆహార సరుకులను పంపిణీ చేశారు. అనంతరం రాష్ట్ర, ఆలేరు నియోజకవర్గం, నలుమూలల నుండి భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు, నాయకుల సమక్షంలో జన్మదిన వేడుకలు అట్టహాసంగా కొనసాగాయి.అభిమానులు ఏర్పాటు చేసిన భారీ క్రేన్ గజమాలతో బీర్ల అయిలయ్యని ఘనంగా సత్కరించారు.సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా, పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.అదేవిధంగా విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేసి వారి విద్యాభివృద్ధికి తన సహకారాన్ని తెలియజేశారు.ఉదయం నుండి సాయంత్రం వరకు బీర్ల నిలయం వద్ద అభిమానులు, ప్రజలు, కార్యకర్తల రాకపోకలతో ప్రాంతం జనసంద్రంగా మారింది. జన్మదిన వేడుకలు ఆనందోత్సాహాల మధ్య వైభవంగా సాగాయి.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల సర్పంచులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అభయాంజనేయ స్వామి ఆలయంలో మహిళల ప్రత్యేక పూజలు



కన్నెపల్లి మండలంలోని జనకాపూర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం మహిళ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికమాసం లో భాగంగా మహిళలు వివిధ రకాల పండ్లు, కానుకలు ఆలయ అర్చకుడు శ్రీనివాస్ శర్మకు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వన్యప్రాణులు, పక్షుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం

### -పారుపల్లి పెద్ద చెరువు వద్ద బర్డ్ వాక్, వన్యప్రాణుల అవగాహన కార్యక్రమం

### జీవ వైవిధ్య పరిరక్షణతోనే ప్రకృతి సమతుల్యత సాధ్యం

### -గ్రామస్తులు, యువతకు బర్డ్ వాచింగ్, ట్రెక్కింగ్ ద్వారా పర్యావరణ అవగాహన

### మంథని అటవీ రేంజ్ అధికారి వినయ్ నాయక్




ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా వన్యప్రాణులు, పక్షుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని మంథని అటవీ రేంజ్ అధికారి ఎం. వినయ్ నాయక్ అన్నారు. శనివారం ముత్తారం(మంథని) మండలంలోని పారుపల్లి, మైదంబండ, బేగంపేట సెక్షన్‌లో ఉన్న పారుపల్లి పెద్ద చెరువు వద్ద బర్డ్ వాక్స్ అండ్ వైల్డ్ లైఫ్ అవేర్‌నెస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువతకు అడవుల్లో నివసించే వివిధ రకాల పక్షులు, వన్యప్రాణులు, జీవ వైవిధ్యం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంథని అటవీ రేంజ్ అధికారి ఎం. వినయ్ నాయక్ మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో పక్షులు, వన్యప్రాణులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. జీవ వైవిధ్య పరిరక్షణ ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. అడవులు, చెరువులు, సహజ వనరుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బర్డ్ వాచింగ్, ట్రెక్కింగ్, పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ అంశాలపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. పారుపల్లి గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతి సంపద పరిరక్షణకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి జె. తిరుపతి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్కే. నహీదా పర్వీన్ (బేగంపేట), ఎస్డి. రహమతుల్లా, ఎం. అమీర్ ద్దీన్, ఫారెస్ట్ బీట్ అధికారులు ఎస్. మేఘరాజ్, టి. రామ్‌సింగ్, ఎ. మాధురి, పి. రంజిత, బయాలజిస్ట్ చంద్రకాంత్, పోతారం, పారుపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

# గోపా మహబూబ్ నగర్ జిల్లా సన్నాహక సమావేశం ఘన విజయం

గౌడ్ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మహబూబ్‌నగర్ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో జిల్లా సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశాన్ని గోపా మాజీ జిల్లా అధ్యక్షులు బాగన్న గౌడ్ (విశ్రాంత పోలీసు అధికారి), పీఆర్‌టీయూ జిల్లా గౌరవాధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ లు నిర్వహించిన ఈ సమావేశానికి 50 మంది సభ్యులు హాజరు అయ్యారు. ఈ కార్యక్రమానికి గోపా రాష్ట్ర కమిటీ తరపున ఆర్గనైజింగ్ సెక్రటరీ యల్మకంటి మీరయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, 1975 " గోపా " స్థాపన నుంచి నేటి వరకు సంస్థ చేపట్టిన సామాజిక, విద్యా, ఉద్యోగ సంబంధిత కార్యక్రమాలను వివరించారు. అలాగే భవిష్యత్తులో గౌడ్ సమాజ అభ్యున్నతి, యువత ప్రోత్సాహం, విద్యా అవకాశాల విస్తరణ, ఉద్యోగ మార్గదర్శక కార్యక్రమాలు మరియు సంఘటిత కార్యాచరణపై సంస్థ చేపట్టబోయే కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న గౌడ్ ఆఫీషియల్స్, ప్రొఫెషనల్స్, ప్రముఖులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్యంగా సత్యనారాయణ గౌడ్, పబ్బ శశిధర్ గౌడ్, రాజయ్య గౌడ్, శ్రీధర్ గౌడ్, పురుషోత్తమ్ గౌడ్, నారాయణ గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మోహన్ గౌడ్, తిరుపతయ్య గౌడ్ తదితరులు మాట్లాడారు. హాజరైన సభ్యులు మాట్లాడిన తర్వాత జిల్లా స్థాయిలో "గోపా " కమిటీని త్వరలో ఏర్పాటు చేయాలని, సంస్థ కార్యక్రమాలను గ్రామ స్థాయి వరకు విస్తరించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. జిల్లా కమిటీ ఏర్పాటు విషయంలో అందరూ తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ సమ్మతి తెలిపారు.



# అనుమతి లేని అనాధ శరణాలయాల పై చట్టప్రకారం కఠినచర్యలు

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి జూన్ 06 సూర్య న్యూస్ :-** అనుమతి లేని అనాధ శరణాలయాల పై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారిని శారద ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం 0 నుండి 18 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఆశ్రయం కల్పిస్తున్న ప్రతి అనాధ శరణాలయం, స్వచ్ఛంద సంస్థ తప్పనిసరి గా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొంది ఉండవలెను అని, పిల్లలకు ఆశ్రమం కల్పిస్తూ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందనటువంటి అనాధ శరణాలయం స్వచ్ఛంద సంస్థలపై బాలల న్యాయ చట్టం 2015 సెక్షన్ 42 ప్రకారంగా ఒక సంవత్సరం జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతున్నది అని కావున మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో ఏదైనా అనాధ శరణాలయం బాలలకు ఆశ్రయం కల్పిస్తూ ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకోనట్లయితే వెంటనే సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖ వారిని సంప్రదించి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందవలసిందిగా తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, పోలీస్ శాఖ వాళ్ళ సహాయంతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రిజిస్ట్రేషన్ అయిన అన్ని స్వచ్ఛంద సంస్థలను అనాధ ఆశ్రయాలను పరిశీలన చేయడం జరుగుతున్నది అదే సమయంలో అనుమతులు లేకుండా నడిపిస్తున్న అనాధ ఆశ్రమాలను గుర్తిస్తూ వాటిపైన కూడా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయంపై మరిన్ని వివరాలు కొరకు బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ లేదా జిల్లా బాలల రక్షణ సంరక్షణ అధికారి ని సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 82478 14647, 8520043943. ఇట్లు జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు.

# మహిళల భద్రత బాలల రక్షణ పై అవగాహన

**ఇన్స్పెక్టర్ అర్జునయ్య**

**మహిళలపై జరిగే వివిధ రకాల హింసల పై అవగాహన**

**గుడ్ టచ్ -బాడ్ టచ్ పై వివరణ**

**అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 1098, 1930 నెంబర్లకు ఫోన్ చేయాలి**

**మహిళలు బాలికల రక్షణ కోసం పోలీసులు కృషి**

**మహిళలు పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత**




ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళల భద్రత, బాలల రక్షణపై అవగాహన కార్యక్రమం భువనగిరి పట్టణంలోని రావి భద్రారెడ్డి ఫంక్షన్ హాల్ లో శనివారం భువనగిరి పోలీసులు నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్ష్ యాదవ్ ఆదేశాల మేరకు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అర్జునయ్య ఆధ్వర్యంలో మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, షీ టీమ్, భరోసా సెంటర్, సి డి ఈ డబ్ల్యూ సిబ్బంది సంయుక్తంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, షీ టీమ్ సిబ్బంది, భరోసా సెంటర్ సిబ్బంది, మహిళా మండలి సభ్యులు, అరోరా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, మహిళలకు మహిళల భద్రత, బాలల రక్షణకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా లింగ సమానత్వం, బాలల భద్రత, పితృస్వామ్య భావజాలం, మహిళల పట్ల వివక్ష, లింగ వివక్ష, లింగ పక్షపాతం, మహిళలు, పిల్లలపై జరిగే వివిధ రకాల హింస గురించి వివరించారు. అలాగే షీ టీమ్, మహిళా పోలీస్ స్టేషన్ విధులు, వాటి సేవలు, మహిళలకు అందించే సహాయం, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, సైబర్ బుల్లీయింగ్, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, ఉద్యోగ ప్రదేశాల్లో వేధింపులు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నిబంధనలు టి షెప్ యాప్ వినియోగం గురించి సమగ్రంగా వివరించారు. సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 నంబర్లకు ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. మహిళలు, బాలికలు, విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా షీ టీమ్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. సమాజంలో మహిళలు, పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చట్టాలపై అవగాహన పెంపొందించు కోవడం ద్వారా నేరాలను నివారించవచ్చని తెలిపారు. జిల్లా పోలీసు శాఖ ప్రజల భద్రత, మహిళల రక్షణ, బాలల సంక్షేమం కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తుందని అధికారులు తెలిపారు.

# ఓటమి గెలుపుకు తొలిమెట్టు






## మంత్రి వాకిటి శ్రీహరి

**విద్యార్థులు ఫోన్ లకు అలవాటు పడకుండా మైదానాలకు అలవాటు పడాలి మత్తు వదలి మైదానాలు చేరాలనే నినాదం తో ప్రభుత్వం ముందుకెళుతుంది**

ఓటమి గెలుపుకు తొలిమెట్టని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి లో దాదాపు నెల పైగా సాగిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలకు తెలంగాణ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ శివసేనా రెడ్డి,తో కలిసి ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏప్రిల్ 24 నుండి జూన్ 7 వరకు జరిగిన ఈ సమ్మర్ క్యాంపు లో 600 మంది విద్యార్థులు పాల్గొనడం అభినశీదనీయమన్నారు.

ప్రతీ సంవత్సరం వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. చిన్న చిన్న సమస్యలకు విద్యార్థులు మానసికంగా కుంగి పోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు క్రీడలు మాత్రమే మానసిక, శారీరక ధ్రుడత్వాన్ని కలగ జేస్తాయని తెలిపారు. ఓటమికి కుంగిపోకుండా మళ్ళీ ఎలా విజయం సాధించాలనే కసి విద్యార్థులకు పెరగాలన్నారు. విద్యార్థులు ఫోన్ లకు అలవాటు పడకుండా మైదానాలకు అలవాటు పడాలని హితబోధ చేశారు. మత్తు వదలి మైదానాలు చేరాలనే నినాదం తో ఈ ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తుందని తెలియజేశారు. ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ ద్వారా రాష్ట్రంలో ఉన్న అన్నీ మైదానాలను అభివృద్ధి చేసి మంచి నైపుణ్యం ఉన్న కోచ్ లను నియమించనున్నట్లు తెలిపారు. ఈసారి క్రీడలకు బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించిందని స్పష్టం చేశారు. సీఎం కప్ సెకండ్ ఎడిషన్ లో భాగంగా దాదాపు 3 లక్షల మంది పిల్లలు గ్రామీణ,

మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి లో క్రీడలు ఆడారని పేర్కొన్నారు. ఇప్పుడు 3వ ఎడిషన్ లో 5 లక్షల క్రీడాకారులను పాల్గొనేలా చేయడమే ధ్యేయం గా పెట్టుకున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా సమ్మర్ క్యాంపు లో శిక్షణ పొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలకు అనూహ్య స్పందన

లభించిందని, నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ మైదానాలన్నీ క్రీడాకారులతో కళకళలాడాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు, కోచులు పాల్గొన్నారు.

# కెమికల్ అండ్ ఫార్మ కంపెనీల పై ఎస్.జి.ఎఫ్ టీములు దాడులు

**పలుచోట నాటు సారా బట్టిలపై బట్టీలను ధ్వంసం, బెల్లం స్వాధీనం**



ఎస్.జి.ఎఫ్ బి టీం, సి టీం, డి టీములు శనివారం పలు ఫార్మా కంపెనీలు కెమికల్ కంపెనీలను పరిశీలించడం తోపాటు పలుచోట్ల నాటు సార పట్టిలను కూడా ధ్వంసం చేశారు. ఎస్.జి.ఎఫ్ డి పి కొత్తకోట ప్రాంతంలో ఇడ్లీగల్గా అమ్మకాలు జరుపుతున్న కళ్ళు దుకాణాన్ని సీజ్ చేసినట్లు సిఐ నాగరాజు తెలిపారు. ఎస్.జి.ఎఫ్ సి టీం మూడు ఫార్మా అండ్ కెమికల్ కంపెనీ కుకట్పల్లి ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఇదే ప్రాంతంలోని రెండు కెమికల్ అండ్ ఫార్మా కంపెనీలను ఎస్టిఎఫ్ సిటీ సీఐ వెంకటేశ్వర్ల టీం తనిఖీలు చేపట్టారు. నాగర్ కర్నూల్ ప్రాంతానికి హైదరాబాద్ నుంచి తరలిస్తున్న 90 కేజీల బెల్లం బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్ చేసినట్లు ఎస్ టి ఎఫ్ బి టీం ఎస్సై బాలరాజు తెలిపారు. సూర్యాపేట హుజూర్నగర్ ప్రాంతాల్లో కొత్త తండా పై ఎస్ టి ఎఫ్ సి టీం సీఐ వెంకటేశ్వర్లు సిబ్బంది కలిసి దాడి చేసి నాటు సారా పట్టిలను ధ్వంసం చేశారు.

# శిల్పారామంలో అలరించిన కర్ణాటక గాత్ర కచేరి, భరతనాట్య ప్రదర్శనలు





మాదాపూర్ లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భగంగా శనివారం కర్ణాటక గాత్ర కచేరి, భరతనాట్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. లక్ష్మి సౌందర్య తన గాత్ర కచేరి లో అన్నమయ్య, తాగరాజా సంకీర్తనలు, కృతులు, భజన్స్ ఆలపించి మంత్ర ముగ్దులను చేసారు. మీనాక్షి శిష్య బృందం " సద్గురు సమీరం" కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. మహేశ్వరి మహాకాళి, అయిగిరినందిని , శ్రీనివాస కళ్యాణం, అఖిలాండేశ్వరి, అన్నమాచార్య కీర్తనలు, అమ్మ ఆనందదాయని, పరులన్నమాట, ముద్దుగారే యశోద మొదలైన అంశాలకి కళాకారులూ హారిక, జాహ్నవి, మనస్విని, ధరణి, జోషి, కళ్యాణి, లక్ష్మి, సంజన, హేమిత, కల్పనా, రమాదేవి మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

# గచ్చిబౌలిలో ఘనంగా ముగిసిన యోనెక్స్-సన్‌రైజ్ సబ్ జూనియర్ ర్యాంకింగ్ టోర్నీ



గచ్చిబౌలి లోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా మే 29 నుంచి నిర్వహించిన యోనెక్స్-సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ (అండర్-15, అండర్-17) ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శనివారం ఘనంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి 3,600 మందికి పైగా యువ షట్లర్లు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వారం రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో భవిష్యత్ స్టార్ షట్లర్లు తమ నైపుణ్యాన్ని చాటుకుంటూ ప్రేక్షకులను అలరించారు. అండర్-15 బాలుర సింగిల్స్‌లో ఉత్తరాఖండ్‌కు చెందిన ఆదిత్య సింగ్ నేగి ఛాంపియన్‌గా నిలవగా, బాలికల సింగిల్స్‌లో రాజస్థాన్‌కు చెందిన అన్వి రాథోర్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. తెలంగాణకు చెందిన హంసిని రన్నరప్‌గా నిలిచి ప్రశంసలు అందుకుంది. అండర్-17 బాలికల సింగిల్స్ విభాగంలో అవని విజేతగా నిలిచింది. బాలుర డబుల్స్‌లో తమిళనాడుకు చెందిన తాబిన్ అనుఫ్ అహ్మద్ ఎం.ఎఫ్ తెలంగాణకు చెందిన శ్రీచేతన్ శౌర్య శామల జోడీ అద్భుత ఆటతీరుతో విజేతలుగా నిలిచింది. బాలికల డబుల్స్‌లో కేరళకు చెందిన అలెక్సియా ఎల్సా అలెగ్జాండర్, తమిళనాడుకు చెందిన జయ సప్తశ్రీ ఎం జోడీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మిజోరంకు చెందిన లియాన్‌సాంగ్పుయా, నాగాలాండ్‌కు చెందిన కిమ్‌కిమ్ ఖోంగ్‌సై జోడీ ఛాంపియన్‌గా అవతరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి,, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత బ్యాడ్మింటన్ అభివృద్ధిలో జాతీయ ప్రధాన కోచ్ డా. పుల్లెల గోపీచంద్ పాత్ర అపూర్వమని కొనియాడారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రపంచ వేదిక వరకు ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దడంలో ఆయన చేస్తున్న కృషి దేశ క్రీడారంగానికి అమూల్యమైనదని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి షట్లర్లను తయారు చేసి భారత ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన గోపీచంద్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. విజేతలు, రన్నరప్ క్రీడాకారులను అభినందించిన వి చాముండేశ్వరి నాథ్ యువ క్రీడాకారుల విజయాల్లో కోచ్‌లు, తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. కఠోర సాధనతో ముందుకు సాగుతున్న యువ షట్లర్లు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ యు.వి.ఎన్. బాబు బాయ్, కన్వీనర్ ఉమర్ రషీద్, బ్యాట్ ఉపాధ్యక్షులు వి.చాముండేశ్వరి నాథ్, బ్యాట్ సలహాదారు కొసరాజు లక్ష్మణ్, కోశాధికారి కె.వంశీధర్, బ్యాట్ సభ్యులు శ్రీనివాసరావు, మీడియా కోఆర్డినేటర్ రమణా రెడ్డి, స్పాన్సర్ రాజిరెడ్డి, గ్లోబల్ సొల్యూషన్స్ ప్రతినిధి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్



గాజులరామారం డివిజన్ పరిధిలోని బాలాజీ లేఅవుట్ నందు శ్రీ భీమేశ్వర దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ హాజరై స్వామివారికి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమేశ్వర స్వామి ఆశీస్సులు కృపా కటాక్షాలు చల్లని దీవెనలు ఆయురారోగ్యాలతో కూడిన జీవితాన్ని ప్రజలందరికీ ప్రసాదించాలని ఆకాంక్షించాలి, అదేవిధంగా భీమేశ్వర స్వామి వార్షికోత్సవాలు ఇంత ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి ఆ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు అంజన్న, శ్రీనివాస్, వెంకట్ కుమార్, వేణు, బాలాజీ, రామక్రిష్ణ, చైతన్య, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# రూ.1.30 లక్షల డ్రగ్స్ పట్టివేత

**ఎం డి ఎం ఏ ఎల్ ఎస్ డి బ్లాక్ పట్టివేత**



రంగారెడ్డి కొండాపూర్ ప్రాంతంలోని ప్రేమ్ నగర్ బ్లాక్ బి ఆఫీస్ పెట్ ప్రాంతంలో డ్రగ్ సమ్ముతున్నారని సమాచారం మేరకు ఎస్టిఎఫ్ డి టీం సీఐ నాగరాజు సిబ్బంది కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో 6.5 గ్రాముల ఎండిఎంఎ, 7 ఎల్ ఎస్ డి బ్లాస్ట్ లను స్వాధీనం చేసుకున్నారు. స్కూటీపై కాకినాడకు చెందిన మద్దూరి మణికంఠ భాస్కర్ (21) అనే వ్యక్తి డ్రగ్స్ అమ్మకాలు జరుపుతుండగా పట్టుకున్నారు. డ్రగ్స్ తో పాటు స్కూటీని అతని సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న డ్రగ్స్ విలువ రూ.1.30 లక్షలగా ఉంటుందని అంచనా వేశారు. పట్టుబడిన నిందితుడు రాపిడో నడుపుతూ ఉంటాడు. ఈ ముసుగులో అవసరం ఉన్న వ్యక్తులకు డ్రగ్స్ అమ్మకాలు జరుగుతూ సొమ్ము చేసుకుంటున్నాడు. నిందితున్ని, డ్రగ్స్ను కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సిఐ నాగరాజు తెలిపారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com